


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 01-02-2026 | సంపుటి - 26 | సంచిక -253 | రూ : 4 | పేజీలు: 8


బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా

## మన అభ్యర్థులు ఉండాలి

- అమెరికా నుంచి జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న రేవంత్ రెడ్డి
- మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్న ముఖ్యమంత్రి
- అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని సూచన



2లో



2లో

ఉప ముఖ్యమంత్రిగా

## సునేత్రా పవార్ ప్రమాణ స్వీకారం

- ముంబైలోని లోక్ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్
- ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే సమక్షంలో ప్రమాణం
- సునేత్రాకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ



రేపు కేసీఆర్ సిట్ విచారణ..

## రాష్ట్రవ్యాప్త నిరసనలకు కేటీఆర్ పిలుపు




2లో

- శాంతియుతంగా నిరసన చేపట్టాలన్న కేటీఆర్
- మాజీ మంత్రులు, సీనియర్ నాయకులు పాల్గొనాలని పిలుపు
- పోలీసులతో ఘర్షణలకు దిగవద్దని సూచన

ఇ-సైకిళ్లపై భారీ రాయితీ..

## గిన్నిస్ రికార్డుతో ఏపీ సర్కార్ కొత్త చరిత్ర

- ఏపీలో ఇ-సైకిళ్లపై రూ.10 వేల రాయితీ ప్రకటించిన ప్రభుత్వం
- 24 గంటల్లో 5,555 సైకిళ్లు పంపిణీ చేసి గిన్నిస్ రికార్డు
- కుప్పంలో 3 కిలోమీటర్లు ఇ-సైకిల్ నడిపిన సీఎం చంద్రబాబు
- రూ.35 వేల సైకిల్‌ను రూ.25 వేలకే పొందే అవకాశం
- ఇ-మోటరాడ్ సంస్థతో ఒప్పందం.. కుప్పంలోనే అసెంబ్లింగ్




2లో



2లో

## వనం లోకి వన దేవతలు

- ముగిసిన మేడారం జాతర
- వైభవం గా, సంప్రదాయబద్ధంగా..వన జాతర
- పోరాటం, త్యాగం,నమ్మకాల సమ్మిలితామే మేడారం జాతర





## గగన్‌యాన్ కోసం 8 వేలకు పైగా ప్రయోగాలు

- వ్యోమగాముల భద్రత దృష్ట్యా మానవరహిత రాకెట్ల ప్రయోగం
- మొదటి ప్రయోగం మార్చిలో చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడి
- రాకెట్‌లోని ప్రతి వ్యవస్థను పరిశీలిస్తున్నామన్న ఇస్రో ఛైర్మన్

2లో

అమెరికాలో మళ్లీ షట్‌డౌన్..

పాక్షికంగా స్తంభించిన ప్రభుత్వ కార్యకలాపాలు

- ఫెడరల్ బడ్జెట్‌కు ఆమోదం లభించకపోవడమే కారణం
- నిరసనకారుల మృతితో నిధులపై చర్చలకు ఆటంకం
- షట్‌డౌన్ స్వల్పకాలమేనని అంచనా వేస్తున్న నేతలు
- సెనేట్ ఆమోదించిన ప్యాకేజీపైనే అందరి దృష్టి

2లో





- రేపు కేంద్ర బడ్జెట్ 2026 27ను ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్
- రక్షణ, మౌలిక సదుపాయాలు, మూలధన వ్యయంపై దృష్టి సారించే అవకాశం
- వృద్ధికి ఊతమిస్తూనే ఆర్థిక క్రమశిక్షణ పాటించడంపై ప్రభుత్వం దృష్టి

వృద్ధి మంత్రం.. పొదుపు సూత్రం..

## రేపే కేంద్ర బడ్జెట్

2లో

# ఇ-సైకిళ్లపై భారీ రాయితీ.. గిన్నిస్ రికార్డుతో ఏపీ సర్కార్ కొత్త చరిత్ర

అమరావతి: ఏపీలో పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు పర్యావరణ హిత ఇసైకిళ్లను భారీ రాయితీపై అందిస్తోంది. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా కుప్పంలో 24 గంటల వ్యవధిలో 5,555 ఇసైకిళ్లను పంపిణీ చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. పర్యావరణ హితమైన కుప్పం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.



రూ.10 వేల సబ్సిడీ.. రూ.25 వేలకే సైకిల్ ఇమోటరాడ్స్ అనే సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ప్రకారం, రూ.35,000 విలువైన ఒక్కో ఇసైకిల్‌పై ప్రభుత్వం రూ.10,000 రాయితీ కల్పిస్తోంది. దీంతో ప్రజలు కేవలం రూ.25,000 చెల్లించి ఈ సైకిల్‌ను సొంతం చేసుకోవచ్చు. ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే ఈ సైకిల్ 40 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని అధికారులు తెలిపారు. విశేషమేమిటంటే ఈ సైకిళ్లను కుప్పంలోనే ఇమోటరాడ్ సంస్థ అసెంబుల్ చేస్తోంది. సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఈ సైకిళ్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా తూంసీలోని ప్రజావేదిక వద్దకు ఆయన దాదాపు 3 కిలోమీటర్ల దూరం ఇసైకిల్‌పై ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం గిన్నిస్ రికార్డు సాధించినందుకు గాను చిత్తూరు జిల్లా కలెక్టర్‌కు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ధృవీకరణ పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, కుప్పం ఒక కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టిందని అన్నారు. "ఎన్నికల్లో సైకిల్‌కు ఓటేశారు, అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపించాం" అని పేర్కొన్నారు. ఇసైకిళ్లకు పైసా ఖర్చు లేకుండా ఇంట్లోనే ఛార్జింగ్ చేసుకోవచ్చని, రాబోయే రోజుల్లో మరిన్ని ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు.

## ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్ ప్రమాణ స్వీకారం..

మహారాష్ట్ర: రాజ్యసభ ఎంపీ సునేత్రా పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రంలో ఆ పదవి వరించిన తొలి మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. ముంబైలోని లోక్‌భవన్‌లో, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సమక్షంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమెతో ప్రమాణం చేయించారు. సునేత్రా పవార్ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం లోక్ భవన్‌లో 'అజిత్ దాదా అమర్ రహే' అంటూ నినాదాలు ప్రతిధ్వనించాయి. సునేత్రా పవార్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. అజిత్ పవార్ దార్శనికతను సునేత్రా నెరవేరుస్తారని ఆయన ఆకాంక్షించారు. "మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన, ఈ బాధ్యతను చేపట్టిన మొదటి మహిళ సునేత్రా పవార్ జీకి శుభాకాంక్షలు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఆమె అవిశ్రాంతంగా పనిచేస్తారని మరియు దివంగత అజిత్‌దాదా పవార్ దార్శనికతను నెరవేరుస్తారని నేను విశ్వసిస్తున్నాను" అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో చేసిన పోస్టులో పేర్కొన్నారు. కాగా, ఇటీవల బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం చెందారు. దీనితో ఆ పార్టీ శాసనసభా పక్ష నేతగా ఆయన భార్య సునేత్రా పవార్‌ను ఎన్సీపీ వర్గాలు ఎన్నుకున్నాయి. దీంతో ఆమె ఈ రోజు ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

## అమరావతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పనుల జోరు..

అమరావతి: రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులు మళ్లీ ఊపందుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టుల నిర్మాణంలో వేగం పెరిగింది. ఇందులో భాగంగా అమరావతి పరిధిలోని నవులూరు వద్ద నిర్మిస్తున్న అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పనులు తుది దశకు చేరుకున్నాయి. స్టేడియం నిర్మాణం దాదాపు 90 శాతం పూర్తయిందని ఏపీ మున్సిపల్ శాఖ అధికారులు అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు స్టేడియం నిర్మాణ పనుల పురోగతిని చూపిస్తూ ఓ వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. "రాజధాని అమరావతిలో నవులూరు వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. అత్యాధునిక సౌకర్యాలతో దీనిని సిద్ధం చేస్తున్నాం" అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ స్టేడియంను మొత్తం 24 ఎకరాల విస్తీర్ణంలో 34 వేల సీటింగ్ సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. విజయవాడకు 13 కిలోమీటర్లు, గుంటూరుకు 16 కిలోమీటర్ల దూరంలో వ్యూహాత్మకంగా ఇది నిర్మితమవుతోంది. మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేసి, స్టేడియంను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు తెలిపారు.

## బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా మన అభ్యర్థులు ఉండాలి

హైదరాబాద్: బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ జూమ్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని అన్నారు. ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే అన్నారు. రెబల్స్ విషయంలో మాట్లాడి స్వయంగా సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## రేపు కేసీఆర్ సిట్ విచారణ... రాష్ట్రవ్యాప్త నిరసనలకు కేటీఆర్ పిలుపు

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను విచారణ పేరుతో ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నారని బీఆర్ఎస్ రేపు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. ఆదివారం నాడు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత ఆందోళనలు చేపట్టాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ప్రభుత్వం దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని, ప్రతి మున్సిపల్, నియోజకవర్గ కేంద్రాల్లో బైక్ ర్యాలీలు, నల్ల జెండాలతో నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ ధర్నాలు, రాస్తారోకోలు శాంతియుతంగా చేపట్టాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. మాజీ మంత్రులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఆందోళనల్లో పాల్గొనాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. నిరసనలు శాంతియుతంగా చేపట్టాలని, పోలీసులతో ఘర్షణలకు దిగవద్దని సూచించారు. కాగా, కేసీఆర్ రేపు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణకు హాజరు కానున్నారు. న్యాయ నిపుణులతో చర్చించిన అనంతరం ఆయన విచారణకు హాజరు కావాలని నిర్ణయించారు. నందినగర్‌లోని నివాసంలో సిట్ ఆయనను విచారించనుంది.

## వృద్ధి మంత్రం.. పొదుపు సూత్రం.. రేపే కేంద్ర బడ్జెట్

ఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రేపు (ఫిబ్రవరి 1న) పార్లమెంటులో 202627 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈసారి బడ్జెట్‌లో వృద్ధి వేగాన్ని కొనసాగిస్తూనే, సంక్షేమ పథకాలకు, ఆర్థిక క్రమశిక్షణకు మధ్య ప్రభుత్వం సమతుల్యత పాటించనుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా రక్షణ, మౌలిక సదుపాయాలు, మూలధన వ్యయం, విద్యుత్, అందుబాటు ధరల్లో గృహ నిర్మాణం వంటి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వవచ్చని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో దేశీయ వృద్ధి లక్ష్యాలకు, ద్రవ్యలోటు నియంత్రణకు మధ్య బడ్జెట్ ఒక చక్కటి సమన్వయాన్ని సాధించాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటికే ఆర్థిక క్రమశిక్షణ మార్గంలో స్థిరంగా పయనిస్తోంది. కోవిడ్ సమయంలో 9.2 శాతంగా ఉన్న ద్రవ్యలోటును 2026 ఆర్థిక సంవత్సరానికి 4.4 శాతానికి తగ్గించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ మార్గం నుంచి ప్రభుత్వం పెద్దగా పక్కకు వెళ్లకపోవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఇది 15వ బడ్జెట్ కాగా, నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రికార్డు సృష్టించనున్నారు. గత బడ్జెట్‌లో మధ్యతరగతి వినియోగాన్ని పెంచేందుకు పన్ను రాయితీలపై దృష్టి సారించగా, ఈసారి వినియోగాన్ని ప్రోత్సహించే విధానం పరిమితంగానే ఉంటుందని తెలుస్తోంది. వ్యూహాత్మకంగా ముఖ్యమైన రంగాల్లో మూలధన వ్యయాన్ని పెంచడంపైనే ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించవచ్చని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. పెట్టుబడిదారులు ప్రభుత్వ రుణాల వివరాలు, ద్రవ్యలోటు లక్ష్యాలు, కొత్త అప్పుల ప్రణాళికలపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 202526, వచ్చే ఆర్థిక సంవత్సరానికి (FY27) వృద్ధి రేటు 6.8% నుంచి 7.2% మధ్య ఉండవచ్చని అంచనా వేసింది. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 7.4% కంటే కొంచెం తక్కువ. బడ్జెట్ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, ఫిబ్రవరి 1 ఆదివారం అయినప్పటికీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో పూర్తిస్థాయి ట్రేడింగ్ నిర్వహించాలని నిర్ణయించారు.

## గగన్‌యాన్ కోసం 8 వేలకు పైగా ప్రయోగాలు

జనవరి 31: తొలి మానవరహిత అంతరిక్ష ప్రయాణ మిషన్ 'గగన్‌యాన్'కు సిద్ధమవుతున్నామని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ నారాయణన్ తెలిపారు. క్షేత్రస్థాయిలో నిర్వహించిన 8 వేలకు పైగా ప్రయోగాలు సఫలమయ్యాయని తెలిపారు. వ్యోమగాముల భద్రత దృష్ట్యా మూడు మానవ రహిత రాకెట్‌లను ప్రయోగిస్తున్నట్లు తెలిపారు. మొదటి ప్రయోగం మార్చిలో చేపట్టేందుకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని వెల్లడించారు. రాకెట్‌లోని ప్రతి వ్యవస్థను పరిశీలిస్తున్నామని, గగన్‌యాన్ మిషన్ విజయవంతం చేయడమే అంతిమ లక్ష్యమని పేర్కొన్నారు. రెండో మానవరహిత రాకెట్ ప్రయోగం ఈ ఏడాది చివరలో ఉంటుందని తెలిపారు. భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే లక్ష్యంతో ఇస్రో ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ మిషన్ చేపట్టగా, ఈ ప్రాజెక్టు తుది దశకు చేరిందని అన్నారు. మానవ సహిత స్పేస్ మిషన్‌లో భాగంగా మార్చిలో వ్యోమమిత్ర రోబోను అంతరిక్షంలోకి పంపనున్నారు. కాగా, 2027లో చేపట్టనున్న గగన్‌యాన్ మిషన్ కోసం వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్లు ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అంగద్ ప్రతాప్, అజిత్ కృష్ణన్, వింగ్ కమాండర్ శుభాంశు శుక్లా ఎంపికైన విషయం తెలిసిందే.


## అమెరికాలో మళ్లీ షట్‌డౌన్.. పాక్షికంగా స్తంభించిన ప్రభుత్వ కార్యకలాపాలు


అమెరికా : అమెరికాలో మరోసారి ప్రభుత్వ కార్యకలాపాలు పాక్షికంగా స్తంభించాయి. 2026సంవత్సరానికి సంబంధించిన ఫెడరల్ బడ్జెట్‌కు కాంగ్రెస్ (పార్లమెంట్) ఆమోదం లభించకపోవడంతో శనివారం నుంచి పాక్షిక షట్‌డౌన్ అమల్లోకి వచ్చింది. ఫెడరల్ నిధుల గడువు నిన్న అర్ధరాత్రితో ముగియడంతో ఈ పరిస్థితి తలెత్తింది. అయితే, ఈ షట్‌డౌన్ స్వల్పకాలమేనని, త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని చట్టసభ సభ్యులు అంచనా వేస్తున్నారు. మిన్నియాపాలిస్‌లో ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ ఏజెంట్ల చేతిలో ఇద్దరు నిరసనకారులు మరణించడంపై డెమోక్రాట్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో బడ్జెట్ చర్చలు నిలిచిపోయాయి. ఈ ఘటన కారణంగా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగానికి (డీహెచ్ఎస్) నిధుల కేటాయింపుపై ప్రతిష్ఠంభన ఏర్పడి, షట్‌డౌన్‌కు దారితీసింది. ఒప్పందం కుదరకపోవడంతో విద్య, ఆరోగ్యం, గృహనిర్మాణం, రక్షణ వంటి పలు కీలక శాఖల్లో అత్యవసరం కాని కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఈ షట్‌డౌన్ కొనసాగితే వేలాది మంది ఫెడరల్ ఉద్యోగులు వేతనం లేకుండా పనిచేయాల్సి రావచ్చు లేదా వేతనం లేని సెలవుపై వెళ్లాల్సి ఉంటుంది. "డ్రగ్ స్మగ్లర్లు, చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడేవారు, అక్రమ రవాణాదారులను వదిలేసి.. ట్రంప్ ప్రభుత్వం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై తమ వనరులను వృథా చేస్తోంది" అని సెనేట్ డెమోక్రాటిక్ మైనారిటీ విప్ డిక్ దర్బిన్ విమర్శించారు.

# వనం లోకి వన దేవతలు

(ములుగు, ప్రజాస్ఫూర్తి) : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర 2026 భక్తిప్రపత్తుల మధ్య ఘనంగా ముగిసింది. వన దేవతలు సమ్మక్క, సారలమ్మ లు గద్దెలను శనివారం 7.గంటల 55నిమిషాలకు వీడి వన ప్రవేశం చేయడంతో ఈ జాతర పరిసమాప్తమైంది. వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య, ఉద్విగ్న వాతావరణంలో అమ్మవార్లు చిలకలగుట్టకు, కన్నెపల్లికి, పయనమయ్యారు. భక్తులు అమ్మవార్లకు "వన దేవతలు వనం లోకి" అంటూ ఘనంగా వీడ్కోలు పలికారు. 2026 జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. మేడారం జాతరకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా.... మధ్యప్రదేశ్, చత్తిస్ ఘడ్, ఒడిశా ఇలా దేశ నలుమూలల నుండి జాతర కి విచ్చేసి...అమ్మలకు మొక్కులు చెల్లించుకున్నారు. నిలువెత్తు బంగారం సమర్పించుకున్నారు.







## సంక్షేమ సంఘం సభ్యులు ఐకమత్యంతో పని చేసినప్పుడే సంఘం అభివృద్ధి

*** జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : సంక్షేమ సంఘం సభ్యులు ఐకమత్యంతో ఒకతాటిపై ఉండి పని చేసినప్పుడే సంఘం అభివృద్ధి చెందుతుందని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ కురుమ సంఘం నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, నూతన కురుమ సంఘం సభ్యులు కార్పొరేటర్ కార్యాలయంలో కార్పొరేటర్ కొలుకుల జగన్ ను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జగన్ మాట్లాడుతూ కురుమ సంఘం అధ్యక్ష కార్యదర్శులతో పాటు వారి కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు శ్రీధర్. సిద్ధులు. అధ్యక్షులు. కార్యదర్శులు మల్లేష్, యాదగిరి, శేఖర్, శ్రీనివాస్, ఎర్ర శీను, నరసింహ, వెంకటేష్, శ్రీధర్, కృష్ణ వీరస్వామి, రాములు, బీరయ్య, ఐలయ్య, రాజు వేణు, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు వరం.. సీఎం సహాయనిధి

*** సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: సీఎం సహాయనిధి నిరుపేదల పాలిట వరంలాంటిదని సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామానికి చెందిన పెండ్యాల యాదమ్మకు మంజూరైన విలువైన రూ.1.75లక్షల విలువైన ఎల్ వోసి చెక్కును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అనారోగ్యాల పాలై ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందలేని నిరుపేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు ముందస్తుగా ఎల్ఓసి ఇచ్చి ఆదుకుంటుందన్నారు. ఎల్ వో సి మంజూరుకు సహకరించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుర్కంటి అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, దోనూరి కిరణ్, బొమ్మ అమరావతి, గ్రామస్తులు బొమ్మ సాలయ్య, బొమ్మ రాములు తదితరులు పాల్గొన్నారు.

## 18 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి ఆలకుంట్ల ఝాన్సీ నాగరత్నం రాజు విస్తృత ప్రచారం..



ప్రజా స్ఫూర్తి, నల్లగొండ: నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి ఆలకుంట్ల ఝాన్సీ నాగరత్నం రాజు గెలుపు కోసం శనివారం శ్రీరాంనగర్ కాలనీలో విస్తృత ప్రచారం నిర్వహించారు.కార్పొరేటర్ అభ్యర్థి ఆలకుంట్ల ఝాన్సీ నాగరత్నం రాజు తో పాటు పలువురు పార్టీ శ్రేణులు, వార్డు ప్రజలు ఇంటింటి ప్రచారం చేపట్టి ఓట్లు అభ్యర్థించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ అభ్యర్థి మాట్లాడుతూ ఫిబ్రవరి 11న జరిగే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో గెలిపించాలని కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో నాయకులు కిషన్ రావు, గ పులేందర్ , గట్టిగుర్ల వెంకన్న, బొబ్బలి అంజనేయులు, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## 39 వ డివిజన్ కార్పొరేషన్ లో కార్పొరేటర్ అభ్యర్థి అల్లి వేణు విస్తృత ప్రచారం..



ప్రజా స్ఫూర్తి నల్లగొండ : నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ 39 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి అల్లి వేణు గెలుపు కోసం శనివారం గాంధీనగర్ కాలనీలో విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ అభ్యర్థి అల్లి వేణు తో పాటు పలువురు పార్టీ శ్రేణులు, వార్డు ప్రజలు ఇంటింటి ప్రచారం చేపట్టి ఓట్లు అభ్యర్థించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ అభ్యర్థి మాట్లాడుతూ ఫిబ్రవరి 11న జరిగే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

# తల్లీ బిడ్డల దీవెనలు ముస్తాబాద్ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలి

*** సమ్మక్క-సారక్కలను వేడుకున్న సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా సాగుతున్న సమ్మక్క సారక్క జాతర మహోత్సవాల్లో శనివారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ వేడుకల్లో భాగంగా సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి పాల్గొని అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గద్దెల వద్ద అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్న అంజిరెడ్డి తల్లీ సమ్మక్కసారక్కల దీవెనలు ఎల్లప్పుడూ మనపై ఉండాలని, మండల ప్రజలందరూ పాడిపంటలతో వర్ధిల్లాలని, ప్రతి ఇల్లూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండాలని ఆ వనదేవతలను ప్రజలందరి క్షేమం కోరుతూ మనస్ఫూర్తిగా వేడుకున్నారు. ఈ జాతర మన సంస్కృతికి ప్రతీక అని, ఇంతటి గొప్ప వేడుకలో పాల్గొనడం తన అదృష్టమని ఆయన పేర్కొన్నారు. నాయకులంతా అమ్మవార్ల గద్దెల వద్ద పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసిన కమిటీ సభ్యులను ఈ సందర్భంగా వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో అంజిరెడ్డితో పాటు మొర్రాయిపల్లె ఉప సర్పంచ్ పల్లె ఆనంద్, ముస్తాబాద్ మాజీ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గూడూరి భరత్, పల్లె రంజిత్, ఆగం రెడ్డి, శ్రీనువాస్, కాంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ పార్టీలోకి 20 కుటుంబాల చేరిక

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ కార్యాలయంలో కొత్తగూడెం కాంగ్రెస్ మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ ఎండీ ఖాజా బక్ష్ ఆధ్వర్యంలో సుమారు 20 కుటుంబాలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా వారిని పార్టీలోకి ఆహ్వానించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కోనేరు చిన్ని, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, కొత్తగూడెం కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ గౌస్ ఉద్దీన్ పాల్గొన్నారు. అలాగే క్రిస్టియన్స్ నాయకులు పి.ఆర్. వాట్సన్, పి. నాని మోజోస్, ఆర్. భరత్, ఎస్. కిమ్ కుమార్, ఎస్. గౌతమ్, ఎల్.జె. ప్రవీణ్ కుమార్, పి. శశి కిరణ్, ఏ. స్వాగత్, కే. పవన్, టీ. కార్తీక్, ఐ. రాబిన్ రత్నకర్, ఎస్. ధర్మరాజ్, డి. సురేష్, ఎస్. సంపత్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల పట్ల విశ్వాసంతో పలువురు పార్టీలో చేరడం హర్షణీయమని పేర్కొన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఆపరేషన్ స్మైల్–XIIలో 58 మంది బాలకార్మికులకు విముక్తి

*** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమం ఆపరేషన్ స్మైల్-XII లో భాగంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో 58 మంది బాలకార్మికులను విముక్తి చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. 2026 జనవరి 1 నుంచి జనవరి 31 వరకు జిల్లా వ్యాప్తంగా ఐదు ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో వివిధ పరిశ్రమలు, వ్యాపార సముదాయాల్లో తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నెల రోజుల పాటు జరిగిన ఈ దాడుల్లో 9 మంది బాలికలు, 49 మంది బాలురు ఉన్నట్లు వెల్లడించారు. విముక్తులైన వారిలో ఇతర రాష్ట్రాలకు చెందిన 4 బాలికలు, 27 మంది బాలురు ఉన్నారని తెలిపారు. బాలబాలికలను పనిలో పెట్టుకున్న యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ మొత్తం 36 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన బాలకార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించడంతో పాటు కౌన్సిలింగ్ కూడా నిర్వహించినట్లు ఎస్పీ వివరించారు. జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే వెంటనే డయల్ 100లేదా 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్)కు సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.ఆపరేషన్ స్మైల్-XIIకు డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి నోడల్ అధికారిగా వ్యవహరించగా బృందంలో సమర్థవంతంగా పనిచేసిన షీటీం ఇన్‌స్పెక్టర్ రాము, ఆర్ఎస్ఐ రమాదేవి, ఎస్ఐలు విజయ, సతీష్, శ్రావణ్, రాఘవయ్య, సమ్మిరెడ్డి, లక్ష్మణ్, ఏఎస్ఐ నాగయ్య, పీసీలు మల్లికాంబ, రాంబాబులను ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.




## పోరాట పటిమ కలిగిన కమ్యూనిస్టులనే గెలిపించాలి: ఎండీ జాహంగీర్

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: పదవులు ఆభరణం కాకుండా.. ప్రజల మధ్య ఉంటూ.. ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ.. పోరాట పటిమ కలిగిన సిపిఎం నాయకులను మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి ఎండీ జాహంగీర్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో జిల్లా కమిటీ సభ్యుడు రాగీరు కిష్టయ్య అధ్యక్షతన సిపిఎం మండల కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై ఎండి జహంగీర్ హాజరై మాట్లాడారు. రాజకీయం వ్యాపారంగా మారిందని, అలాటి డబ్బు రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలని సూచించారు. ప్రజా సమస్యలు పట్టని నాయకులు ప్రజలను ప్రలోబాలకు గురి చేసి ఎన్నికల్లో గెలవాలనే వారి ఎత్తులను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై ప్రజా ఉద్యమాలు నిర్వహించిన ఘనత సిపిఎం పార్టీకి ఉందన్నారు. సిపిఎం పార్టీ అభ్యర్థులను గెలిపించి, ప్రజా సమస్యల పరిష్కారానికి బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి, జి.శ్రీనివాస్ చారి, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశం, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి, చింతల సుదర్శన్, బోయ యాదయ్య, మండల కమిటీ సభ్యులు ఆదిమూలం నందీశ్వర్, అంతటి అశోక్, కొండే శ్రీశైలం, ఎలమల్ల సంజీవ, మీసాల శీను, కొంతం సుశీల, రోడ్డ సోని తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 13 వరకు ప్రజావాణి రద్దు

*** జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్**

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : మున్సిపల్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా ఈనెల 13 వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అందువలన ప్రజలు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించేందుకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.



## గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతం

*** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విస్తృత పర్యటించిన వి.పి.గౌతం**



మేడ్చల్ , (ప్రజాస్ఫూర్తి ) : జిహెచ్ ఎంసి పరిధిలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీల్లో కొనసాగుతున్న పనులన్నిటిని త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి.వి.పి.గౌతం అధికారులను ఆదేశించారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో నిర్మాణంలో ఉన్న సుమారు 4000 ఇండ్ల పనులను, దాదాపుగా రూ. 300 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులపై క్షేత్ర స్థాయిలో పర్యటించి సమీక్షించారు. శనివారం ఆయన బౌరంపేట, గాగిల్లాపూర్, దుండిగల్ ప్రాంతాల్లోని డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి కాలనీలోనూ మౌలిక సదుపాయాలతో పాటు, పాఠశాల, పార్కు, అంగన్ వాడీ, రేషన్ షాపుల వంటివి తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. . ఈ కాలనీలను బహుళ అంతస్తుల్లో బ్లాకులుగా నిర్మిస్తున్నందున , ప్రతి బ్లాక్ ను ఒక ప్రాజెక్టుగా తీసుకుని ప్రణాళికా బద్ధంగా పనులన్నిటినీ పూర్తి చేయాలని నిర్దేశించారు. తొలుత బౌరంపేటలో వివిధ దశల్లో ఉన్న 15 బ్లాకుల్లోని 1620 ఇండ్ల పనులను పరిశీలించారు. ఈ పనులను బ్లాకుల వారీగా పూర్తి చేయాలని, డ్రైనేజి, వాటర్ వర్క్స్, విద్యుత్ సంబంధిత పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. అలాగే ఇక్కడ నివసించే వారి సౌకర్యార్థం నిర్మిస్తున్నషాపులను కూడా తగినంత విస్తీర్ణంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, కాంట్రాక్టర్లకు సూచించారు. ఆహ్లాదకర వాతావరణంలో ప్రజలు నివసించేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వీలైనంత త్వరగా వీటిని పూర్తి చేస్తే, లబ్ధిదారులకు అలాట్ చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఆయన గాగిల్లాపూర్ లోని రెండు ప్రాజెక్టులను సందర్శించి, అక్కడి పనుల పురోగతిపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇక్కడ స్థానికులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీసి, ఈ కాలనీల్లో పునరావాసం కింద కేటాయించవలసిన వారికి తొలి ప్రాధాన్యంతో ఇండ్ల కేటాయింపు ప్రక్రియను చేపట్టాలని ప్రత్యేక కార్యదర్శి విపి గౌతం పేర్కొన్నారు. ఈ కాలనీకి సంబంధించి అప్రోచ్ రోడ్ సరిగా లేని విషయాన్ని గమనించి ఇందుకు సంబంధించిన పనులను వెంటనే చేపట్టాలని స్థానిక మున్సిపల్ అధికారులకు చెప్పారు. అటు తరువాత దుండిగల్ లో నిర్మాణంలో ఉన్న 864 ఇండ్ల పురోగతిని సమీక్షించారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు, ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులపై ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టి తీసుకుని వస్తే ఆయా విభాగాల ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. ఈ పర్యటనలో హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఎం.చైతన్య కుమార్, పి.బలరాం, జి. విజయకుమార్, మేడ్చల్ మల్కాజిగిరి ప్రాజెక్టు డైరక్టర్ రమణమూర్తి. జిహెచ్ఎంసి అధికారులు పి.వి. రవీందర్, స్థానిక తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

*** ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పర్యవేక్షించాలి**

నగరంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో రాజీవ్ స్వగృహ, హౌసింగ్ బోర్డుకు ఉన్న భూములన్నిటికి ప్రహారీ గోడల నిర్మించాలని అవి అన్యాక్రాంతం కాకుండా నిరంతరం పర్యవేక్షించాలని గృహనిర్మాణ శాఖ ప్రత్యక కార్యదర్శి శ్రీ విపి గౌతం అధికారులను ఆదేశించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని గాజుల రామారం, బౌరం పేట ప్రాంతాల్లో రాజీవ్ స్వగృహ, హౌసింగ్ బోర్డుకు చెందిన పలు అపార్ట్ మెంట్ టవర్లను, ఓపెన్ ప్లాట్లను, ఇతర భూములను సందర్శించారు. ప్రాంతాల్లో ఈ రెండు సంస్థలకు సుమారు 40 ఎకరాలకు పైగా ఖాళీ భూములున్నాయి. వీటన్నటిని నిశితంగా పరిశీలించి ఇవి అన్యాక్రాంతం కాకుండా ప్రహారీ గోడలను నిర్మించాలని, సెక్యూరిటీ గార్డులను కూడా నియమించాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. బాచుపల్లి ప్రాంతంలో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ కు చెందిన భూముల్లోని ఆక్రమణలను హైడ్రా సిబ్బంది ఇటీవల కూల్చి వేశారు. ఆ ప్రాంతాలను పరిశీలించి ఇకపై ప్రభుత్వ భూముల పరిరక్షపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ అధికారులకు సూచించారు.

# కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న జనసేన మండల అధ్యక్షుడు


*** పార్టీలోకి ఆహ్వానించిన చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బ వెంకటయ్య**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: జనసేన పార్టీ చౌటుప్పల్ మండల అధ్యక్షుడు శివారెడ్డి శనివారం రాత్రి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లింగోజిగూడెం గ్రామానికి చెందిన జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పర్నె శివారెడ్డి రజిత దంపతులు, జనసేన నాయకుడు బంగారు అంజి, బిజెపి నాయకుడు ఎర్ర ఊషయ్యలను చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బ వెంకటయ్య కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్నె శివారెడ్డి పార్టీలోకి రావడం లింగోజిగూడెంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలం చేకూరినట్లేనన్నారు. పర్నె శివారెడ్డి మాట్లాడుతూ చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బిఎన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మునుగోడు ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఇంద్రసేన రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మండల పార్టీ అధ్యక్షుడు బోయ దేవేందర్, వార్డు అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కేపీహెచ్‌బీ ప్రాంతంలో నియంత్రణలేని స్పా సెంటర్లు



*** మసాజ్ ముసుగులో అనైతిక కార్యకలాపాలు**

కూకట్‌పల్లిలో స్పా, మసాజ్ సెంటర్ ల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా కేపీహెచ్‌బీ కాలనీ, వసంత్ నగర్ ప్రాంతంలో స్పా, మసాజ్ సెంటర్ల సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది. అనుమతులు, నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న కొన్ని స్పా సెంటర్లలో మసాజ్ పేరుతో అనైతిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. యువతను లక్ష్యంగా చేసుకుని ఆకర్షణీయమైన ప్రకటనలు, ఆఫర్లు ఇస్తూ ఈ సెంటర్లు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయని తెలుస్తోంది. ధనార్జనే లక్ష్యంగా పెట్టుకున్న నిర్వాహకులు యువత బలహీనతలను ఆసరాగా చేసుకుని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

*** పోలీసు పర్యవేక్షణపై అనుమానాలు**

కూకట్‌పల్లి నియోజకవర్గంలోనే వందల సంఖ్యలో స్పాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా కేపీహెచ్‌బీ కాలనీలోని ప్రధాన రహదారులు, కొన్ని అపార్ట్‌మెంట్లలో ఈ సెంటర్లు కొనసాగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు అప్పుడప్పుడు తనిఖీలు చేసి ఒకటి రెండు కేసులు నమోదు చేసినప్పటికీ, కొద్ది రోజులకే మళ్లీ కార్యకలాపాలు ప్రారంభమవుతునయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితి పోలీసు పర్యవేక్షణపై అనేక సందేహాలకు తావిస్తోంది. పెద్ద మొత్తంలో డబ్బులు చూపించి బయట ప్రాంతాల నుంచి యువతులను తీసుకువస్తున్నారన్న ఆరోపణలూ వినిపిస్తున్నాయి. దీంతో ఈ సెంటర్లకు వెళ్లే యువత చెడు అలవాట్లకు లోనవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

*** యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పాత్ర ఏది?**

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న స్పా సెంటర్లను నియంత్రించాల్సిన యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ కార్యకలాపాలు కనిపించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత కొన్నేళ్లుగా సమస్య తీవ్రత పెరుగుతున్నా, ప్రత్యేక దృష్టి సారించిన చర్యలు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు.

*** చర్యలు తీసుకోవాలని డిమాండ్**

స్పా సెంటర్ల పేరుతో సాగుతున్న అనుమానాస్పద కార్యకలాపాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని, అక్రమంగా నడుస్తున్న సెంటర్లను మూసివేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కఠిన నియంత్రణలు అవసరమని వారు కోరుతున్నారు.



## ఎన్నికల విధులలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం

*** జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ ..**

ప్రజా స్ఫూర్తి, నల్లగొండ: ఎన్నికల విధులలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ అన్నారు. శనివారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఉదయాదీత్య భవన్లో మున్సిపల్ ఎన్నికల ప్రీసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు పార్టీ ఆధారంగా జరుగుతాయని, అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పాటించిన విధంగానే అన్ని నియమ, నిబంధనలు ఈ ఎన్నికలలో సైతం వర్తిస్తాయన్నారు. ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఇచ్చే మెటీరియల్ ను పి ఓ లు జాగ్రత్తగా తనిఖీ చేసుకోవాలని ,బ్యాలెట్ బాక్స్ ల సీలింగ్ ప్రక్రియను నియమ నిబంధనల ప్రకారం అనుసరించి చేయాలని చెప్పారు. ప్రిసైడింగ్ అధికారుల డైరీని జాగ్రత్తగా రాయాలని ,రెండు కాపీలు సిద్ధం చేసుకోవాలని, బ్యాలెట్ పేపర్ ఎకౌంటు చెక్ చేసుకోవడంతో పాటు ,ఓటర్లు బ్యాలెట్ పేపర్ తీసుకున్న తర్వాత తప్పనిసరిగా బ్యాలెట్ బాక్స్ లో ఓటు వేస్తున్నది లేనిది గమనించేందుకు ఒక ఏపీఓను నియమించాలని, పోలింగ్ కేంద్రంలోకి 5 గురు ఓటర్లను మించి అనుమతించవద్దని ,అంధులైన ఓటర్లకు సంబంధించి అనుమతించే సహాయకులు తప్పనిసరిగా 18 సంవత్సరాలు నిండిన వారై ఉండాలని, ఓటింగ్ కంపార్ట్మెంట్లో ఓటు వేసేందుకు ఇచ్చే మార్క్ తప్ప ఇతర ఏ వస్తువులు ఉండకూడదని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను సిబ్బంది అందరూ సీరియస్ గా తీసుకోవాలని, ఎవరు తప్పులు చేయవద్దని ,నిర్లక్ష్యంగా ఉండవద్దని, ఒకవేళ ఎవరైనా తప్పు చేస్తే ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు, రాష్ట్ర ఎస్ సి ఈ ఆర్ టి సంచాలకులు జి. రమేష్ మాట్లాడుతూ పిఒ, ఏ పి ఓ లు ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలని, బ్యాలెట్ పేపర్ అకౌంట్ ,పిఓ డైరీ అన్ని ఖచ్చితంగా, జాగ్రత్తగా తప్పులు లేకుండా పూరించాలని ,అలాగే వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రానికి సంబంధించిన బ్యాలెట్ పేపరే వచ్చింది లేనిది ఒకటికి రెండుసార్లు చూసుకోవాలని, ఎన్నికల సామాగ్రిని సైతం తనిఖీ చేసుకోవాలని, ఎన్నికల విధుల్లో తేడా వస్తే పివోలు బాధ్యత వహించాల్సి ఉంటుందని, ఇచ్చిన అన్ని ఫారమ్స్ పూర్తిగా నింపాలని తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె . శ్రీనివాస్ పి ఓలకు ,ఏపీ ఓ లకు సూచనలు చేశారు . స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, గృహనిర్మాణ శాఖ పిడి రాజకుమార్, డిఈఓ బిక్షపతి, మాస్టర్ ట్రైనర్లు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.

## గంజాయి అక్రమ రవాణాపై పోరాడి.. మృత్యు ఒడికి

*** నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఎక్సైజ్ కానిస్టేబుల్ కన్నుమూత**



నిమ్స్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాను పట్టుకునేందుకు ప్రాణాల్ని సైతం లెక్కచేయలేదామె. ఆ ప్రయత్నంలో తీవ్రంగా గాయపడ్డారు. మృత్యువుతో పోరాడి చివరికి ఓడిపోయారు. నిజామాబాద్‌లో జనవరి 23న గంజాయి అక్రమ రవాణాదారులు.. వాహనంతో ఢీకొట్టి, తొక్కించేసిన ఘటనలో తీవ్రంగా గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య(25) పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. సౌమ్యను తొలుత నిజామాబాద్‌లోనే ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా.. చికిత్సలో భాగంగా అక్కడే ఓ కిడ్నీని తొలగించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం అందించేందుకు జనవరి 25 అర్ధరాత్రి నిమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ ఆర్ఐసీయూలో చేర్చుకొని వైద్యం అందించారు. అత్యవసర విభాగం, నెఫ్రాలజీ, కార్డియాలజీ, మెడికల్ గ్యాస్ట్రో, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాల ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో వెంటిలేటర్‌పై చికిత్స అందించారు.

**వైద్యులు శ్రమించినా...**

సౌమ్య పరిస్థితిపై మంత్రులు దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఇతర ప్రముఖులు ఆరా తీస్తూ ఆమె కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. ఆమెను కాపాడేందుకు వైద్యబృందం తీవ్రంగా శ్రమించినా ఫలితం దక్కలేదు. 2024 బ్యాచ్ కానిస్టేబుల్ జి.సౌమ్య స్వగ్రామం నిజామాబాద్ జిల్లాలోని మోస్రా మండల కేంద్రం. ఆమె తల్లిదండ్రులు మసాలా దినుసులు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటారు. కుమార్తెను కష్టపడి చదివించారు. ఎక్సైజ్ శాఖలో చేరి.. సుమారు ఏడాది కాలంలోనే సౌమ్య దుండగుల దౌర్జన్యానికి బలైపోయారు.

# చిన్నగా ‘మాయ’ చేయొచ్చు!



**ఆఫీసు అయినా, ప్రయాణమైనా... ‘ముందు జాగ్రత్త’ మీదే మన దృష్టి కదూ! అనుకోకుండా పార్టీకి పిలుపు రావొచ్చు. హడావుడిగా సిద్ధమవ్వాల్సి ఉండొచ్చు. అవసరం ఏదైనా అప్పటికప్పుడు కంగారుపడటం మనకు నచ్చదు. కాబట్టే, మనదైన కిట్ హ్యాండ్ బ్యాగులో ఎప్పుడూ ఉండాల్సిందే. కానీ రోజూ ఆ బరువు మోయాలా? చిన్నగా వీటిని ప్రయత్నిస్తే పోలా!**




**రంగుల క్యాప్సూల్**

పెదాలకు రంగులద్దడం వయసుతో సంబంధం లేకుండా ప్రతి అమ్మాయీ మెచ్చే పని. మేకప్ మీద ఆసక్తి లేకపోయినా ఆఫీసులు, కాలేజీలకు దీన్ని మాత్రం రోజువారీగా ప్రయత్నించేవాళ్లూ చాలామందే. అంతేనా, మూడ్‌ని బట్టి షేడ్‌ని ఎంచుకుంటుంటారు. అంటే బ్యాగులో కనీసం రెండు మూడైనా ఉండాల్సిందేగా! ఈ చిట్టి మ్యాటే లిప్‌స్టిక్‌లు తీసుకోండి. రెండు మూడేంటి ఎన్నైనా పెట్టేసుకోవచ్చు. పైగా బరువు తక్కువ.

**కురులనీ మెరిపించొచ్చు**

ముఖాన్ని అయితే మేకప్‌తో మాయ చేయొచ్చు. మరి కురుల సంగతేంటి? పొరపాటున వారం రోజులు ఊరెళ్తున్నామంటే షాంపూ శాచెట్లు తీసుకెళ్లొచ్చు. కండిషనర్ అలాకాదుగా! మరి







పరిష్కారం ఏంటంటే... ఈ హెయిర్ క్యాప్సూల్సే. చిట్టిగా ఉన్న వీటిని తుంచి, సీరమ్‌ను కురులకు పట్టిస్తే సరి. చక్కగా మెరుస్తూ నిగనిగలాడతాయి.

**మేకప్ అద్దేయొచ్చు**

ఫౌండేషన్, కన్సీలర్... ముఖం మెరిపించాలంటే ఈ బేసిక్ ఉత్పత్తులు కావాల్సిందే. వీటినీ ఏ జంజాటం లేకుండా తీసుకెళ్లొచ్చు. మేకప్ క్యాప్సూల్స్ అందుకు వచ్చినవే. కొన్ని అయితే బీబీ, సీసీ క్రీమ్‌ల్లా ఒకటే రాసుకుంటే సరిపోయేలానూ వస్తున్నాయి. ముఖానికి అలా టచప్ ఇచ్చేస్తే చాలు. పర్‌ఫెక్ట్ లుక్‌తో బయటికి వెళ్లిపోవచ్చు. బరువు లేకుండా... అందం విషయంలో రాజీ పడకుండా ఈ చిట్టి నేస్తాలు భలేగున్నాయి కదూ! కీ చెయిన్‌కి చిట్టి బ్యాగు తగిలించుకునీ వీటిని సర్దేసుకోవచ్చు. ఇంకేం ప్రయత్నించేయండి మరి.

# సందర్శకులతో పోటెత్తిన బేగంపేట .. ముగిసిన వింగ్స్ ఇండియా ప్రదర్శన

హైదరాబాద్: వింగ్స్ ఇండియా 2026 విమానయాన ప్రదర్శన చివరి రోజైన శనివారం బేగంపేట విమానాశ్రయానికి సందర్శకులు పోటెత్తారు. ఉదయం 8 గంటల నుంచే నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు విమానాశ్రయానికి చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో చిన్నారులు, మహిళలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులతో 10 గంటలకే విమానాశ్రయం కిటకిటలాడింది. దీంతో ఈ మార్గంలో అన్ని రహదారుల్లో ట్రాఫిక్



స్తంభించింది. పార్కింగ్ కోసం కేటాయించిన ఎయిర్ కార్గో ప్రాంగణం, విమానాశ్రయం పార్కింగ్ స్థలాలు, వాతావరణ శాఖ కేంద్ర పరిసరాలు వాహనాలతో నిండిపోయాయి. విమానయాన ప్రదర్శన చివరి రెండు రోజులు సందర్శకులను అనుమతించడంతో దాదాపు 70 వేల మంది వీక్షించారు. తొలి రెండు రోజుల్లో 7,500 మంది వ్యాపారులు, రెండు వేల మందికి పైగా బిజినెస్ డెలిగేట్స్ ప్రదర్శనకు హాజరయ్యారు. ఆయా వ్యాపార సమూహాలతో 500లకు పైగా సమావేశాలు, ఎన్నో ఒప్పందాలు జరిగాయి. విమానయాన సంస్థలు తాము తయారు చేసే పనిముట్లు, వాహనాలు, విమాన విడి భాగాలు, శిక్షణ సంస్థలు, విమానాశ్రయాల కార్యకలాపాలతో 150 స్టాళ్లు ఏర్పాటు చేశాయి. చివరి రోజు విమాన విన్యాసాలు సందర్శకులకు కనువిందు చేశాయి. మార్క్ జెఫ్రీ బృందం రెండు సార్లు, భారత వాయుసేనకు చెందిన సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం ఒకసారి విమానాలతో చేసిన విన్యాసాలను సందర్శకులు ఆసక్తిగా వీక్షించారు.













## తెలంగాణపై ప్రధానికి చిన్నచూపు.. ఈసారైనా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

హైదరాబాద్: బడ్జెట్‌లో తెలంగాణకు కేంద్రం నిధులు కేటాయించేలా రాష్ట్ర భాజపా ఎంపీలు కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు ఏం కావాలో ఎప్పటి నుంచో అడుగుతున్నామని తెలిపారు. తెలంగాణపై ప్రధాని మోదీ చిన్నచూపు



చూస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ పుట్టుకనే ప్రధాని మోదీ అవమానించారని విమర్శించారు. ఆర్ఆర్ఆర్, మెట్రోకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. "కేంద్రం నుంచి ఏమీ అడగబోమని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అహంకారంగా మాట్లాడింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కేంద్రంతో సయోధ్య కోరుకుంటోంది. బడ్జెట్‌లో మా ప్రతిపాదనలను కేంద్రం అంగీకరించాల్సిందే. తెలంగాణ ఎంపీలు రాష్ట్రం కోసం పోరాడాలి. భారత ఫ్యూచర్ సిటీకి కేంద్రం సహకరించాలి. రాష్ట్ర పెండింగ్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలపాలి" అని పొన్నం ప్రభాకర్ అన్నారు.

## తెలంగాణ వ్యాప్తంగా ఆందోళనలకు బీఆర్ఎస్ పిలుపు

హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్‌పై ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక, రాజకీయ కక్షసాధింపు చర్యలను నిరసిస్తూ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఆందోళనలు చేపట్టాలని ఆ పార్టీ పిలుపునిచ్చింది. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కేసీఆర్‌ను వేధిస్తోందని, రాజకీయ వేధింపుల్లో భాగంగా అవమానిస్తూ అమానుషంగా ప్రవర్తిస్తోందని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. టెలిఫోన్ ట్యాపింగ్ పేరిట కట్టుకథలు సృష్టించి, ఇప్పుడు సిట్ విచారణ పేరుతో నోటీసులు జారీ చేయడం దుర్మార్గమైన వైఖరి అని విమర్శించారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా రేపు రాష్ట్రంలోని 12వేల పైచిలుకు గ్రామాల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మల దహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి మున్సిపల్, నియోజకవర్గ కేంద్రాల్లో మోటార్ సైకిల్ ర్యాలీలు, నల్ల జెండాలతో నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టడం ద్వారా ప్రభుత్వానికి నిరసన సెగ తగిలేలా చేయాలన్నారు. పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు ఎక్కడికక్కడ తమ సొంత జిల్లాల్లోనే ఉండి ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు. నిరసనలు ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా ఉండాలని, పోలీసులతో ఘర్షణలకు



తావివ్వకుండా ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజలకు వివరించాలని కోరారు. పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్... అన్ని చోట్లా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పూర్తి శాంతియుత వాతావరణంలో ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఎక్కడా ఆవేశాలకు లోనుకావద్దని విజ్ఞప్తి చేశారు. జిల్లాల్లో ఉన్న నేతలు అక్కడే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. హైదరాబాద్ లో అందుబాటులో ఉన్న నేతలు, శ్రేణులు తెలంగాణ భవన్‌కు చేరుకోవాలన్నారు. కేసీఆర్ విచారణ, నిరసన కార్యక్రమాల దృష్ట్యా తెలంగాణ భవన్‌లో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్దసంఖ్యలో నేతలు, శ్రేణులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు.



### సీసీ కెమెరాల నిఘాలో
## ఇంటర్ పరీక్షల పర్యవేక్షణ

పరీక్షల నిర్వహణలో పారదర్శకత కోసం ఇంటర్ బోర్డు కఠిన చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీల ల్యాబ్‌లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డు ప్రధాన కార్యాలయంలో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. ఫిబ్రవరి 2 నుంచి జరగనున్న ప్రాక్టికల్ పరీక్షలను ఈ కంట్రోల్ సెంటర్ ద్వారానే అధికారులు లైవ్ లో పర్యవేక్షించనున్నారు. గతేడాది ప్రభుత్వ జూనియర్ కాలేజీలతో పాటు కొన్ని ప్రైవేటు కాలేజీల కెమెరాలను మాత్రమే బోర్డుకు అనుసంధానించారు. ఈ సారి అన్ని ప్రైవేటు కాలేజీలను కూడా దీని పరిధిలోకి తెచ్చారు. దీంతో పరీక్షల టైం లో ఎక్కడైనా మాస్ కాపీయింగ్ జరిగినా, నిబంధనలు ఉల్లంఘించినా క్షణాల్లో తెలిసిపోతుంది. ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఈ ఏర్పాట్లు చేసినట్లు శనివారం ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు

**ఏర్పాట్లు పూర్తి..**

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి (టీజీబీఐఈ) అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఫిబ్రవరి 2 నుంచి ఫిబ్రవరి 21 వరకు ఈ పరీక్షలు ప్రతి రోజు రెండు సెషన్లలో జరగనున్నాయి. ఉదయం సెషన్ 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1440 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో జనరల్, వొకేషనల్ కేంద్రాలు ఉన్నాయి. ఈ ఏడాది మొత్తం 5,26,192 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో ఎంపీసీ నుంచి 2,74,007 మంది, బైపీసీ నుంచి 1,33,415 మంది, వృత్తి విద్య కోర్సుల నుంచి 1,18,770 మంది విద్యార్థులు ఉన్నారు.

## జీహెచ్ఎంసీ బడ్జెట్ రూ. 11,460 కోట్లు.. ఆమోదించిన కౌన్సిల్.. సభ్యుల కీలక వ్యాఖ్యలు

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) వార్షిక బడ్జెట్‌ను చివరి స్పెషల్ జనరల్ బాడీ సమావేశం ఆమోదించింది. శనివారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన జీహెచ్ఎంసీ 10వ ప్రత్యేక బడ్జెట్ సమావేశంలో కమిషనర్ కర్ణన్, అడిషనల్ కమిషనర్(ఫైనాన్స్) అనురాగ్ జయంతి ప్రవేశపెట్టిన ప్రతిపాదనలపై సభ్యులు చర్చించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, మజ్లిస్ పార్టీల నుంచి సభ్యులు చర్చలో పాల్గొన్నారు. జీహెచ్ఎంసీ మొత్తం బడ్జెట్ రూ. 11,460 కోట్లుగా పేర్కొంది. ఆదాయం రూ. 6,441 కోట్లు, జీహెచ్ఎంసీ ఖర్చు రూ. 4,057 కోట్లు, రెవెన్యూ మిగులు రూ.2,384 కోట్లు, రెవెన్యూ గ్రాంట్స్ రూ. 400 కోట్లు, కొత్తగా విలీనమైన మున్సిపాలిటీల కోసం రూ.2,260 కోట్లను కేటాయించింది. విలీనమైన 27 మున్సిపాలిటీల నుంచి వచ్చిన రెవెన్యూ రూ. 1,860 కోట్లుగా పేర్కొంది. జీహెచ్ఎంసీ బడ్జెట్ కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

* **జీహెచ్ఎంసీని హైడ్రా ఆక్రమిస్తోంది : బీజేపీ సభ్యుడు శ్రవణ్**

జీహెచ్ఎంసీ పరిధిలో 10 ఫ్లోర్ల కంటే ఎక్కువగా ఉంటే హెచ్ఎండీఏ అనుమతులు జారీ చేయడంతో జీహెచ్ఎంసీ ఆదాయం తగ్గిపోతుందని, ఈ అధికారాలను జీహెచ్ఎంసీకే ఉండాలని బీజేపీ కార్పొరేటర్ శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీని మూడు



కార్పొరేషన్లుగా చేసిన తర్వాత బడ్జెట్, ఆదాయం, అప్పులను ఏం చేస్తారని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీని హెచ్ఎండీఏ, హైడ్రా వంటి శాఖలు ఆక్రమిస్తున్నాయని, జీహెచ్ఎంసీకే అన్ని రకాల అధికారాలు ఉండాలని కీలక వ్యాఖ్యలు చేశారు.

**వీధి కుక్కలపై కమిటీ ఏమైంది? : సామల హేమ**

జీహెచ్ఎంసీ పరిధిలో వీధికుక్కల నియంత్రణకు వేసిన కమిటీ ఏమైందని బీఆర్ఎస్ కార్పొరేటర్ సామల హేమ ప్రశ్నించారు. ఫిర్యాదులు చేసినా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దోమల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సీఆర్ఎంపీ రోడ్ల నిర్వహణ, అడ్వర్ టైజ్ మెంట్ నుంచి వచ్చే ఆదాయం గురించి క్లారిటీ ఇవ్వాలని కోరారు.

**జోన్ల వారీగా బడ్జెట్ కేటాయింపులేవి?**


జీహెచ్ఎంసీని విస్తరించిన అధికారులు 12 జోన్లకు సంబంధించిన ఆదాయ, వ్యయాలు, బడ్జెట్ కేటాయింపు లేవని ఎంఎల్ఏ మాజీద్ హుస్సేన్ ప్రశ్నించారు. 20 ఏండ్ల కాలంలో ఆస్తిపన్ను పెంచలేదని బడ్జెట్ లో పొందుపర్చారు. కానీ పేదలకు సంబంధించిన టాక్స్ పెంచి, పెద్దలకు సంబంధించిన టాక్స్ ను పెంచలేదన్నారు. ఆఫ్జల్ సాగర్ నాలా, బుల్కాపూర్ నాలా అభివృద్ధి పనులు ఏమయ్యాయని ప్రశ్నించారు. దేవునికుంట హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులు రెండేండ్లనుంచి నిలిచిపోయాయని, ఎన్నిస్మశాన వాటికలను అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. శివారు ప్రాంతాల్లోని ఎంత ఆదాయం వస్తుందని, విలీన మున్సిపాలిటీల్లో ఎన్ని అప్పులు ఉన్నాయో బడ్జెట్ లో చెప్పలేదన్నారు.

# 'రిపబ్లిక్ డే'లో మోదీ పక్కన ప్రశాంతంగా నిలబడి.. ఎవరీ సిద్ధార్థ్ బాబు..?



రిపబ్లిక్ పరేడ్ లో మనమంతా సైనిక విన్యాసాలు, శకటాలను అబ్బురంగా వీక్షించాం. ఆ వేడుకకు అతిథులుగా వచ్చిన ప్రపంచనేతలు ఎవరా..?అని ఆసక్తిగా గమనించాం. ఆ సమయంలో ఓ యువకుడు అటు మోదీకి.. ఇటు అతిథులుగా వచ్చిన ఐరోపా నేతలకు మధ్య వారధిగా వ్యవహరించారు. ఆ స్థాయి నేతల మధ్య జరిగిన సంభాషణను ఎలాంటి తడబాటు లేకుండా వారికి అర్థమయ్యే భాషలో వివరించడాన్ని దేశం మొత్తం చూసింది. దాంతో ఆయన ఎవరా..? అని నెటిజన్లు ఆరా తీయడం మొదలుపెట్టారు. ఆయనొక ఐఎఫ్ఎస్ అధికారి. పేరు సిద్ధార్థ్ బాబు .కేరళలోని కొచ్చి స్వస్థలం. సివిల్ సర్వీసెస్ గురించి పెద్దగా అవగాహన లేని ఆయన.. తొలుత ఇంజినీరింగ్ పూర్తిచేశారు. మెకానికల్ బ్రాంచ్‌లో పట్టా పొందిన సిద్ధార్థ్.. తర్వాత ఇకామర్స్ రంగంలో కొంతకాలంపాటు పనిచేశారు. ఆ సమయంలో ఆయన చూసిన సినిమాలు, థ్రిల్లర్స్, టెలివిజన్ షోలు అంతర్జాతీయ వ్యవహారాలపై ఆసక్తిని పెంచాయి. ప్రపంచ రాజకీయాలు, అంతర్జాతీయ వేదికలపై భారత్ ప్రాతినిధ్యాన్ని మరింత అర్థం చేసుకునేందుకు పుస్తకాలు చదవడం మొదలుపెట్టారు. ఆ ప్రక్రియే తన డ్రీమ్‌ను డిసైడ్ చేసింది. కార్పొరేట్ జాబ్ వదిలేసి, యూపీఎస్సీ పరీక్షలు రాయాలన్న నిర్ణయానికి వచ్చేలా చేసింది. అనుకున్నట్టుగానే చదివి, తొలిసారి పరీక్ష రాశారు. కానీ విజయం మాత్రం పలకరించలేదు. తన లోపాలను సరిచేసుకుంటూ మరో ప్రయత్నం చేసి.. యూపీఎస్సీ 2016లో జాతీయస్థాయిలో 15వ ర్యాంకు సాధించారు. అందరినీ ఆశ్చర్యపరుస్తూ ఐఏఎస్‌ను కాదని ఐఎఫ్ఎస్ ఎంచుకున్నారు. కాలిఫోర్నియాలోని మిడిల్బరీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్‌లో తన నైపుణ్యాలను మెరుగుపర్చుకున్నారు. పలు భాషల్లో ప్రావీణ్యం సంపాదించుకున్న సిద్ధార్థ్.. చూడటానికి ప్రశాంతంగా కనిపిస్తారు. వీటివల్లే ఆయన దౌత్యవ్యవహారాల్లో కీలకంగా మారారు. అందుకే అంతర్జాతీయ వేదికలపై ఉన్నతస్థాయి సమావేశాల్లో నేతల మధ్య సంభాషణలను సమన్వయం చేస్తుంటారు. ప్రస్తుతం విదేశాంగ శాఖలో డిప్యూటీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. దాంతో విదేశీ నేతలతో నిత్యం సంప్రదింపులు చేయాల్సి ఉంటుంది. రిపబ్లిక్ డే పరేడ్‌లో యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్, ప్రధాని మోదీ మాట్లాడుకుంటున్న సమయంలో నెట్టింట్లో వైరల్‌గా మారారు. మోదీకి దుబాసిగా వ్యవహరించడం అంటే విశ్వాసం, బాధ్యతకు గుర్తు. ప్రధాని పక్కన ప్రశాంతంగా నిలబడి తన పనితాను చేసుకుపోయిన ఈ యువ అధికారి ఇప్పుడు భారత ఆధునిక దౌత్యానికి చిహ్నంగా మారారు.


## పేదలను దృష్టిలో పెట్టుకొని
# బడ్జెట్ రూపొందించాలి: కపిల్ సిబల్



అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ అంతకంతకూ క్షీణిస్తోంది. గురువారం ఏకంగా 92 మార్క్‌ను తాకి, సరికొత్త జీవనకాల కనిష్ఠానికి చేరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రూపాయి విలువ ఇంత క్షీణిస్తున్నప్పటికీ దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు, రూపాయి రేటు డాలర్‌కు 63 ఉండగా, ఇప్పుడు ప్రస్తుతం 92 అయ్యిందన్నారు. అయినప్పటికీ దీనిపై ప్రధాని నోరు మెదపట్లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదివారం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో సిబల్ ఈ వ్యాఖ్యలు చేశారు. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్ పేదలకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రతి ఏడాది అనుకుంటున్నానని.. కానీ గత 11ఏళ్లుగా ఆ విధంగా జరగట్లేదని సిబల్ అన్నారు. ఆదివారం ప్రవేశపెట్టే బడ్జెట్ అయినా పేదల బాధను తగ్గించి, ఆనందాన్ని పెంచుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటని అన్నారు. అందుకు అనుగుణంగానే పేద ప్రజల అభివృద్ధి, తక్కువ నిధులు ఉన్న రాష్ట్రాల పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌ను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

# బంగాళాఖాతంపై 'నోటమ్' జారీ.. క్షిపణి పరీక్షల కోసమేనా?

దిల్లీ: బంగాళాఖాతంపై భారత్ నోటమ్ (NOTAM) జారీ చేసింది. ఫిబ్రవరి 5,6 తేదీల్లో బంగాళాఖాతంపై 3,190 కిలోమీటర్ల పరిధిలో విమానాలను అనుమతించబోమంటూ నోటీసు (నోటమ్) ఇచ్చింది. గతంలో 2,530 కిలోమీటర్లు ఉన్న నోటమ్ పరిమితిని సుమారు 3,190 కిలోమీటర్లకు పెంచినట్లు తెలుస్తోంది. క్షిపణి పరీక్షల కోసం భారత్ ఈ నోటీసు జారీ చేసినట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.



సముద్ర ఆధారిత క్షిపణి పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఫిబ్రవరి 5, 6 తేదీల్లో బంగాళాఖాతం గగనతలంలో ఎటువంటి పౌర విమానాలూ ఎగరడానికి అనుమతి ఉండదని తెలిపాయి. అయితే క్షిపణుల ప్రయోగంపై భారత ప్రభుత్వం ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. కాగా ఆపరేషన్ సింధూర్ తర్వాత పెద్ద మొత్తంలో ఆయుధాలను సమకూర్చుకుంటున్న భారత్.. స్వదేశీ ఆయుధాల తయారీని వేగవంతం చేసింది. ఇందులో భాగంగా పలు క్షిపణి పరీక్షలను చురుకుగా నిర్వహిస్తోంది. నోటమ్ అంటే ఎయిర్‌మెన్ సహా సంబంధిత విభాగాలకు నోటీసులు ఇవ్వడం. సైనిక కార్యకలాపాలు, క్షిపణి పరీక్షలు, పెద్ద ఎయిర్ ఆపరేషన్లు లేదా ప్రమాదకర పరిస్థితుల సమయంలో దీన్ని జారీ చేస్తారు. నిర్దిష్ట గగనతల ప్రాంతాల్లో పౌర విమానాల ప్రయాణాన్ని తాత్కాలికంగా నిషేధించడం దీని ఉద్దేశం. ఇలా చేయడం వల్ల సైనిక కార్యకలాపాలకు సురక్షిత గగనతలం లభిస్తుంది. పౌర విమానాలు ప్రమాద జోన్‌లోకి వెళ్లకుండా నిరోధించడం సాధ్యమవుతుంది.

# ఎన్సీపీ విలీనాన్ని అజిత్ కోరుకున్నారు : శరద్‌పవార్

ఎన్సీపీ నాయకుడు అజిత్ పవార్ ఆకస్మిక మరణం తర్వాత మహారాష్ట్ర రాజకీయాల్లో తదుపరి పరిణామాలపై చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో ఆయన బాబాయ్ శరద్‌పవార్ స్పందించారు. ఎన్సీపీ రెండు వర్గాల విలీనానికి అజిత్ సానుకూలంగా ఉండేవాడని గుర్తుచేసుకున్నారు. ''విలీనంపై చర్చలు జరిగాయి. ఫిబ్రవరి 12న రెండు వర్గాలు కలిసిపోవాలని అజిత్ కోరుకున్నాడు'' అని సీనియర్ పవార్ వెల్లడించారు. దురదృష్టవశాత్తూ విమాన ప్రమాదంతో ఆ చర్చలు ఆగిపోయాయని శనివారం వ్యాఖ్యానించారు.

**సునేత్ర ప్రమాణం గురించి తెలియదు**

అజిత్ పవార్ సతీమణి సునేత్రా పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై తనకు ఎలాంటి సమాచారం లేదని శరద్ పవార్ పేర్కొన్నారు. ''నాకు ఎలాంటి సమాచారం లేదు. ఈ పరిణామాల గురించి ఎలాంటి అవగాహన లేదు. ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరె ఆ పార్టీలో సీనియర్ నాయకులు. వారు భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తారు'' అని వెల్లడించారు. మహారాష్ట్రలో అధికారిక కూటమి మహాయుతిలో ఎన్సీపీ భాగం. ఇప్పుడు అజిత్ పవార్ స్థానంలో సునేత్ర డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేస్తే.. మహారాష్ట్రలో ఆ పదవిని చేపట్టిన తొలి మహిళగా నిలుస్తారు. ఈ రోజు సాయంత్రం ఈ కార్యక్రమం జరగనుందని, ఇందులో ఎన్సీపీ (ఎస్పీ) నేత శరద్ పవార్, ఆయన కుమార్తె సుప్రియా సూలే పాల్గొనకపోవచ్చని తెలుస్తోంది. మరోవైపు, బారామతిలో పార్టీ నేతలతో సీనియర్ పవార్ సమావేశం నిర్వహించారు.




# అధికారంలోకి వస్తే..
## 45 రోజుల్లో సరిహద్దుల్లో కంచె: అమిత్ షా



పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో ప్రయోజనాలు పొందడం కోసం చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించడం, అవినీతిని వ్యవస్థీకృతం చేయడం, సరిహద్దు భద్రతా చర్యలను ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడమేనని మండిపడ్డారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బ్యారక్‌పుర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన ఆయన.. తాము అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లో సరిహద్దు కంచె వేస్తామన్నారు. ''పశ్చిమ బెంగాల్‌లో చొరబాట్లు జరుగుతున్న తీరు దేశమంతటికీ ప్రధాన సమస్యగా మారింది. కోర్టు ఆదేశాల తర్వాత కూడా బార్డర్ ఫెన్సింగ్ కోసం బీఎస్ఎఫ్‌కు టీఎంసీ ప్రభుత్వం భూమిని కేటాయించడం లేదు. ఎందుకంటే.. చొరబాటుదారులను ఆ పార్టీ ఓటు బ్యాంకుగా చూస్తోంది. రాష్ట్ర పోలీసులు, అధికారులు అక్రమ వలసలను అడ్డుకోవడం లేదు. దీంతో నకిలీ పత్రాలతో వాళ్లంతా దేశమంతా వెళ్తున్నారు. ఇటువంటి నేపథ్యంలో దేశ భద్రత కోసం బెంగాల్‌లో భాజపా గెలుపు ఎంతో అవసరం'' అని అమిత్ షా వ్యాఖ్యానించారు.


# ఉద్రిక్తతల వేళ.. ఇరాన్ పోర్టులో భారీ పేలుడు

ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ పోర్టులో భారీ పేలుడు సంభవించింది. దీని ప్రభావంతో సమీప నివాస భవనాలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. పేలుడుకు గల కారణాలు మాత్రం తెలియలేదు. అయితే, ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ నేవీ కమాండర్ లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నప్పటికీ.. స్థానిక అధికారిక మీడియా వాటిని ఖండించింది. ప్రస్తుతం అమెరికా ఇరాన్‌లు యుద్ధానికి సై అంటున్న వేళ ఇక్కడ పేలుడు కలకలం రేపింది. బందర్ అబ్బాస్ నౌకాశ్రయం



హోర్ముజ్ జలసంధిలో ఉంది. ఇరాన్, ఒమన్‌ల మధ్య కీలక జలమార్గం. ప్రపంచ చమురు రవాణాలో ఐదో వంతు ఈ మార్గం ద్వారానే సరఫరా అవుతుంది. గతేడాది ఏప్రిల్‌లోనూ బందర్ అబ్బాస్ సమీపంలోని పోర్టులో భారీ పేలుడు సంభవించిన ఘటనలో మందిలాది మంది గాయపడినట్టు అప్పట్లోనే వార్తలు వచ్చాయి. అయితే, ఇప్పటికే ఇరాన్ దిశగా అమెరికా యుద్ధ విమానాలు చేరుకుంటుండగా.. ఇరాన్ కూడా హోర్ముజ్‌లో నౌకాదళ విన్యాసాలు చేయనున్నట్లు ప్రకటించింది.

## కాఫీ చైన్లపై దాడులకు
# ఎర్రకోట ఉగ్ర ముఠా కుట్రలు..!



దిల్లీలో పేలుడు కేసును దర్యాప్తు చేసే కొద్దీ వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ పన్నిన అనేక కుట్రలు బయటపడుతున్నాయి. ఈ కేసుకు సంబంధించిన మరిన్ని విషయాలను దర్యాప్తు అధికారులు తాజాగా వెల్లడించారు. ఈ దాడికి పాల్పడిన వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్.. ప్రఖ్యాత కాఫీ చైన్లను లక్ష్యంగా చేసుకున్నట్లు విచారణలో వెల్లడయ్యిందన్నారు. భారత్‌లోని ప్రధాన నగరాల్లో ఉన్న ఓ ప్రఖ్యాత కాఫీ చైన్‌లలో ఉగ్రదాడులకు నిందితులు ప్రణాళికలు సిద్ధం చేశారని పేర్కొన్నారు. తాము అదుపులోకి తీసుకున్న టెర్రర్ మాడ్యూల్ నాలుగేళ్లుగా చురుగ్గా ఉందని అధికారులు తెలిపారు. నాటినుంచి వారు ఉగ్రదాడులకు కుట్ర పన్నుతూ.. భారీ స్థాయిలో పేలుడు పదార్థాలను తయారుచేస్తున్నారన్నారు. విదేశీ ఆయుధాలను కూడా నిందితులు కొనుగోలు చేశారన్నారు. వీటి కొనుగోళ్లకు పుల్వామా దాడి కుట్రదారుడు ఉమర్ ఫరూఖ్ భార్య అఫ్రా బీబీ సాయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణాల్లోని ముఖ్య నగరాల్లో రద్దీగా ఉండే ప్రాంతాల్లో నవంబర్, డిసెంబర్ నెలల్లో పలు ఉగ్ర దాడులకు ప్లాన్ చేశారన్నారు. అయితే అంతకుముందే వీరిని అదుపులోకి తీసుకోవడం వల్ల వాటిని ఆపగలిగినట్లు పేర్కొన్నారు. వీరితో సంబంధమున్న మరికొందరు అనుమానితుల పైనా నిఘా పెట్టామన్నారు.

# లాయర్‌గా నమ్మించి మోసం.. ఆస్ట్రేలియాలో భారత విద్యార్థికి జైలు

ఆస్ట్రేలియాలో ఓ భారతీయ విద్యార్థి జైలు పాలయ్యాడు. లాయర్‌గా నమ్మించి ఓ వ్యక్తిని ఆర్థికంగా మోసగించడంతో అతనికి రెండేళ్ల శిక్ష పడింది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. భారత్‌కు చెందిన 28 ఏళ్ల ప్రదీప్.. విద్యార్థి వీసాపై ఆస్ట్రేలియాలో నివసిస్తున్నాడు. ఉబర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సిడ్నీకి చెందిన ఒక ప్రముఖ న్యాయసంస్థ పేరిట నకిలీ సంస్థ ఏర్పాటుచేశాడు. ఈ క్రమంలో న్యాయసేవల కోసం తన వద్దకు వచ్చిన ఓ వ్యక్తిని మభ్యపెట్టి.. 2 లక్షల ఆస్ట్రేలియా డాలర్ల మేర డబ్బు గుంజాడు.



అతడి ప్రవర్తనపై అనుమానం వచ్చి బాధితుడు మరో న్యాయవాది వద్దకు వెళ్లడంతో ప్రదీప్ మోసం బయటపడింది. బాధితుడు చేసిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అయితే మోసగించిన సొమ్ములో 900 ఆస్ట్రేలియా డాలర్లను మాత్రమే స్వాధీనం చేసుకోగలిగారు. మిగతా సొమ్ముతో అతడు బంగారం కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ఈ కేసులో ప్రదీప్ దోషిగా తేలడంతో లివర్‌పూల్ స్థానిక న్యాయస్థానం అతడికి రెండేళ్ల జైలు శిక్ష విధించింది.

# రాజ్యసభకు అజిత్ పవార్ కుమారుడు..?

దివంగత అజిత్ పవార్ పెద్ద కుమారుడు పార్థ్ పవార్ రాజ్యసభలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు మీడియాలో కథనాలు వస్తున్నాయి. ప్రస్తుతం ఎంపీగా ఉన్న ఆయన తల్లి సునేత్రా పవార్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నట్లు నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) వర్గాలు పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ స్థానాన్ని పార్థ్ భర్తీ చేయనున్నట్లు ఎన్సీపీ వర్గాలు తెలిపాయి. పార్థ్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో మావల్ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగారు. అయితే, ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. ఇదిలాఉండగా.. ముంబయిలో నేడు పార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశం కానుందని పార్టీ నేత ఒకరు తెలిపారు.

# అప్పులు అడగటం సిగ్గుగా అనిపించింది: పాక్ ప్రధాని

పాకిస్థాన్ తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. దీనినుంచి బయటపడేందుకు మిత్ర దేశాల వద్దకు వెళ్లి మరీ రుణాలు అడగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని తాజాగా ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫే అంగీకరించారు. అప్పులు అడగటం తనకుసిగ్గుగా అనిపించిందని వ్యాఖ్యానించారు. ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ ఎగుమతిదారులు, వ్యాపారులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌తో కలిసి నేను రహస్యంగా మిత్ర దేశాల వద్దకు వెళ్లి అప్పులు అడిగాను. ఆ సమయంలో మాకు చాలా సిగ్గుగా అనిపించింది. రుణాలు తీసుకోవడం ఆత్మగౌరవానికి పెద్ద దెబ్బ. డబ్బులు ఇచ్చేవారు ఏం డిమాండు చేసినా సరే.. అడ్డు చెప్పలేని పరిస్థితి ఉంటుంది' అని షరీఫ్ అన్నారు. అయితే రుణాలు ఇచ్చే విషయంలో చాలా దేశాలు తమను నిరాశ పరచలేదన్నారు. పరిస్థితులతో సంబంధం లేకుండా పాక్‌కు మద్దతుగా నిలిచిన సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, చైనా వంటి మిత్ర దేశాలన్నింటికీ ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిపోవడంపై షరీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ఆర్థికసాయం అందించిన దేశాల్లో చైనా మొదటి స్థానంలో ఉందన్నారు.

# ఒక్క రోజులో కిలో వెండికి లక్ష రూపాయల నష్టం..

షాక్ అవుతున్న ఇన్వెస్టర్లు!

వెండిని హోల్డ్ చేయాలా లేదా

ప్రాఫిట్ బుక్ చేయాలా అనే సందిగ్ధంలో ఇన్వెస్టర్లు

డాలర్ బలపడటంతో బంగారం, వెండి ధరలు పతనం



**న్యూఢిల్లీ:** వెండి మార్కెట్‌లో ఒక్క రోజులోనే భారీ దెబ్బ తగిలింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లో వెండి ధరలు 25% పడిపోయి, కిలోకు దాదాపు రూ.1 లక్ష నష్టం జరిగింది. రికార్డు గరిష్ట స్థాయికి చేరిన తర్వాత వెంటనే ఈ పతనం ఇన్వెస్టర్లను తీవ్రంగా కంగారు పెట్టింది. ఇప్పుడు వెండిని హోల్డ్ చేయాలా, లాభాలు బుక్ చేయాలా లేదా మరిన్ని హెచ్చరికలు తీసుకోవాలా అని అందరూ ఆలోచనలో పడ్డారు.

ఎంసీఎక్స్ వెండి ధరలు ఈ వారం ప్రారంభంలో రూ.4 లక్షల స్థాయికి చేరుకున్నాయి. కానీ నిన్న ఒక్క రోజులోనే రూ.3 లక్షల స్థాయికి దిగివచ్చాయి. ఇది వెండి చరిత్రలోనే అతిపెద్ద రోజువారీ పతనాల్లో ఒకటి. అంతర్జాతీయ మార్కెట్లలో స్పాట్ వెండి 28% తగ్గి 85 డాలర్లకు చేరింది (గరిష్ఠం 121.60 డాలర్లు). బంగారం కూడా 9% పడిపోయింది.

ఈ పతనానికి ప్రధాన కారణం... అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫెడ్ చైర్‌గా కెవిన్ వార్ష్‌ను ఎంపిక చేయడంతో ఫెడ్ స్వతంత్రతపై భయాలు తగ్గాయి. దీంతో, డాలర్ ఇండెక్స్ గత సంవత్సరం మే తర్వాత అతిపెద్ద రోజువారీ పెరుగుదల నమోదు చేసి 97కి చేరింది. బలమైన డాలర్ వల్ల బంగారం, వెండి ధరలు తగ్గాయి. ఇవి డాలర్ ధర పరిధిలో ఉండటం వల్ల విదేశీ కొనుగోలుదారులకు ఖరీదైనవి అవుతాయి.

బంగారం పతనం వెండిని మరింత దెబ్బతీసింది. జేఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ రిపోర్ట్ ఏం చెబుతోందంటే... ఇప్పటికే వెండిని హోల్డ్ చేస్తున్న వారు రూ.3 లక్షల కింద స్టాప్ లాస్ ఉంచాలని సూచిస్తోంది.

## పాకిస్థాన్‌లో భారీగా పతనమైన బంగారం ధర

పాకిస్థాన్‌లో మళ్లీ తగ్గిన బంగారం ధరలు

తులం బంగారంపై ఒక్కరోజే రూ. 25,500 క్షీణత

రెండు రోజుల్లోనే తులంపై రూ. 61,000 పతనం

రికార్డ్ స్థాయి నుంచి భారీగా దిగివచ్చిన పసిడి రేట్లు

అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో తగ్గుతున్న ధరలు



**న్యూఢిల్లీ:** పాకిస్తాన్‌లో బంగారం ధరల పతనం కొనసాగుతోంది. వరుసగా రెండో రోజూ పసిడి రేట్లు భారీగా తగ్గాయి. గురువారం ఒక్కరోజే తులం బంగారంపై ఏకంగా రూ. 25,500 తగ్గగా, రెండు రోజుల్లో మొత్తం క్షీణత రూ. 61,000గా నమోదైంది. ఈ తగ్గుదలతో కొనుగోలుదారులు మార్కెట్ వైపు ఆసక్తిగా చూస్తున్నారు.

ఆల్ పాకిస్తాన్ జెమ్స్ అండ్ జ్యువెలర్స్ సరాఫా అసోసియేషన్ (ఓఖఉఏాం) విడుదల చేసిన వివరాల ప్రకారం, గురువారం తులం బంగారం ధర రూ. 25,500 తగ్గి రూ. 5,11,862కి చేరింది. అదేవిధంగా, 10 గ్రాముల బంగారం ధర రూ. 21,862 తగ్గి రూ. 4,38,839 వద్ద నిలిచింది. అంతకుముందు రోజు, బుధవారం కూడా తులంపై రూ. 35,500 తగ్గడం గమనార్హం.

అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా పసిడి ధరలు భారీగా పడిపోయాయి. ఔన్స్ బంగారం ధర 255 డాలర్లు తగ్గి 4,895 డాలర్ల వద్ద స్థిరపడింది. అంతర్జాతీయంగా ధరలు తగ్గడం, స్థానిక మార్కెట్‌లో డిమాండ్ వంటి అంశాలే ఈ క్షీణతకు కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. కొద్ది రోజుల క్రితం, జనవరి 28న తులం బంగారం ధర రూ. 5,51,000 దాటి ఆల్-టైమ్ రికార్డును సృష్టించింది. రికార్డు స్థాయికి చేరిన తర్వాత ధరలు ఒక్కసారిగా కుప్పకూలడంతో పెట్టుబడిదారులు, కొనుగోలుదారులు మార్కెట్ తీరును జాగ్రత్తగా గమనిస్తున్నారు.

## బడ్జెట్ కోసం ప్రత్యేక ట్రేడింగ్..

ఆదివారం కూడా పనిచేయనున్న స్టాక్ మార్కెట్లు

కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో నేడు ప్రత్యేక ట్రేడింగ్ సెషన్

ఆదివారం అయినప్పటికీ యథాతథంగా కొనసాగనున్న మార్కెట్లు

ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్

సెటిల్‌మెంట్ హాలిడే కావడంతో షేర్ల క్రయవిక్రయాలపై నిబంధనలు




**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం 2026-27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో భారత స్టాక్ ఎక్స్ఛేంజీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. నేడు (ఫిబ్రవరి 1) ఆదివారం అయినప్పటికీ స్టాక్ మార్కెట్లలో పూర్తిస్థాయి ట్రేడింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించాయి. దీంతో ఇన్వెస్టర్లు బడ్జెట్ ప్రకటనలకు అనుగుణంగా తమ వ్యూహాలను మార్చుకునేందుకు వీలు కలుగుతుంది.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేడు ఉదయం 11 గంటలకు లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లు యథావిధిగా ఉదయం 9:15 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు పనిచేస్తాయని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ఒక సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. నిర్మలా సీతారామన్‌కు ఇది వరుసగా తొమ్మిదో బడ్జెట్ కావడం విశేషం. ఎన్డీయే కూటమి వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రవేశపెడుతున్న రెండో పూర్తిస్థాయి బడ్జెట్ ఇది.

అయితే, ఫిబ్రవరి 1న సెటిల్‌మెంట్ హాలిడే కావడంతో ట్రేడింగ్‌పై కొన్ని నిబంధనలు వర్తిస్తాయి. జనవరి 30న కొనుగోలు చేసిన షేర్లను బడ్జెట్ రోజున (ఫిబ్రవరి 1) అమ్మడానికి వీలుండదు. అలాగే బడ్జెట్ రోజున కొన్న స్టాక్స్‌ను మరుసటి రోజు విక్రయించడం సాధ్యం కాదు. ప్రభుత్వ రుణ ప్రణాళిక, ద్రవ్య లోటు లక్ష్యాలపై ఇన్వెస్టర్లు ప్రధానంగా దృష్టి సారించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటు జీడీపీలో 4.1శాతం నుంచి 4.2శాతం మధ్య ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా, ఆర్థిక సర్వే 2025-26ను ఇప్పటికే ఈ నెల 29న పార్లమెంటులో ప్రవేశపెట్టారు.




# చివరి టీ20 మనదే...

కివీస్ పోరాటం చాల్లేదు!

ఐదో టీ20లో భారత్ ఘనవిజయం.. 4-1తో సిరీస్ కైవసం

కేవలం 42 బంతుల్లో సెంచరీ నమోదు చేసిన ఇషాన్ కిషన్

ఐదు వికెట్లు పడగొట్టి కివీస్ పతనాన్ని శాసించిన అర్షదీప్ సింగ్

80 పరుగులతో ఒంటరి పోరాటం చేసిన న్యూజిలాండ్ బ్యాటర్ ఫిన్ అలెన్

టీ20 ప్రపంచకప్‌కు ముందు టీమిండియాకు కీలక విజయం



**తిరువనంతపురం:** న్యూజిలాండ్‌తో జరిగిన ఐదో, చివరి టీ20లో టీమిండియా 46 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఇషాన్ కిషన్ (103) విధ్వంసక సెంచరీకి, అర్ష్‌దీప్ సింగ్ (5/51) ఐదు వికెట్ల ప్రదర్శన తోడవడంతో భారత్ అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4-1 తేడాతో భారత్ కైవసం చేసుకుంది. భారత్ నిర్దేశించిన 272 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో, కివీస్ 19.4 ఓవర్లలో 225 పరుగులకు ఆలౌట్ అయింది.

భారీ లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్‌కు ఫిన్ అలెన్ (38 బంతుల్లో 80) అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. దీంతో కివీస్ పవర్‌ప్లేలో వికెట్ నష్టానికి 79 పరుగులు చేసి భారత్‌పై తమ అత్యుత్తమ పవర్‌ప్లే స్కోరును నమోదు చేసింది. అయితే, దూకుడుగా ఆడుతున్న అలెన్‌ను అక్షర్ పటేల్ (3/33) పెవిలియన్ పంపడంతో మ్యాచ్ మలుపు తిరిగింది.

తొలి స్పెల్‌లో భారీగా పరుగులు ఇచ్చినప్పటికీ, అర్షదీప్ సింగ్ తన రెండో స్పెల్‌లో అద్భుతంగా రాణించాడు. కీలకమైన రచిన్ రవీంద్ర (30) వికెట్‌తో పాటు మరో నాలుగు వికెట్లు తీసి కివీస్ పతనాన్ని శాసించాడు. దీంతో న్యూజిలాండ్ 19.4 ఓవర్లలో 225 పరుగులకు ఆలౌట్ అయింది. టీ20 ప్రపంచకప్‌కు వారం ముందు ఈ సిరీస్ విజయం భారత జట్టు ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచనుంది.

అంతకుముందు, టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 271 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ కేవలం 42 బంతుల్లోనే తన తొలి టీ20 అంతర్జాతీయ శతకాన్ని నమోదు చేశాడు. అతనికి కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (63) చక్కటి సహకారం అందించాడు. చివర్లో హార్దిక్ పాండ్యా (17 బంతుల్లో 42) మెరుపు ఇన్నింగ్స్‌తో భారత్ స్కోరును అమాంతం పెంచాడు. ఇది టీ20 ఫార్మాట్‌లో భారత్‌కు మూడో అత్యధిక స్కోరు కావడం విశేషం.

## కెప్టెన్‌గా సూర్యకుమార్‌కు సరైన గుర్తింపు లభించట్లేదు : ఇర్ఫాన్ పఠాన్



**న్యూఢిల్లీ:** టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ప్రశంశల జల్లు కురిపించాడు. అతని ఆట తీరులో రోహిత్ శర్మ ఛాయలున్నాయని కొనియాడారు. ఒక టీం లీడర్‌గా అతను జట్టును నడిపించటంలో సేమ్‌టు సేమ్ రోహిత్‌ను తలపిస్తాడని పఠాన్ అన్నారు. టి20 కెప్టెన్‌గా సూర్యకుమార్ అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నప్పటికీ అతనికి దక్కాల్సిన గుర్తింపు దక్కట్లేదన్నారు.

'రోహిత్ శర్మ తరువాత కెప్టెన్సీ బాధ్యలు తీసుకున్న సూర్య.. భారత జట్టును ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు నడిపించాడు. అతని కెప్టెన్సీలో 41 టీ20లు ఆడిన భారత్ 31మ్యాచ్‌లు గెలిచింది. 2025 ఆసియా కప్‌ను సైతం స్వాధీనం చేసుకుంది. సూర్య కుమార్ జట్టు కెప్టెన్‌గా అద్భుత ఫలితాలు సాధించినప్పటికీ అతను వ్యక్తిగతగా పరుగులు చేయడంలో విమర్శలకు గురయ్యాడు. ముఖ్యంగా 2025లో ఆడిన మ్యాచ్‌లలో అతను చెప్పుకోదగిన పరుగులు చేయలేకపోయాడు. మొత్తం 21 మ్యాచ్‌లు ఆడిన సూర్య కేవలం 218 పరుగులు సాధించాడు. టి20 ప్రపంచ కప్‌కు ముందు సూర్యకుమార్ అతని ఫామ్‌ను నిరూపించుకోవాల్సిన అవసరముంది' అని పఠాన్ అన్నాడు. కెప్టెన్‌గా అతను వరల్డ్‌కప్‌లో ఖచ్చితంగా ఆడతాడని పేర్కొన్నాడు. కానీ అంత కంటే ముందు అతను పరుగులు చేసి తన సత్తా ఏంటో నిరూపించుకోవాల్సిన అవసరముందని పఠాన్ అభిప్రాయపడ్డాడు.

## టీ20 ప్రపంచకప్‌కు ముందు ఆస్ట్రేలియాకు బిగ్ షాక్...

గాయం కారణంగా టీ20 ప్రపంచకప్‌కు దూరమైన ప్యాట్ కమిన్స్

తుది జట్టులో కమిన్స్ స్థానంలో బెన్ డ్వార్షుయిస్‌కు చోటు

గాయం నుంచి కోలుకుని తిరిగి జట్టులోకి వచ్చిన జోష్ హేజిల్‌వుడ్

మిచెల్ మార్ష్ కెప్టెన్సీలో బరిలోకి దిగనున్న ఆస్ట్రేలియా



**సిడ్నీ:** ఫిబ్రవరి 7న ప్రారంభం కానున్న టీ20 ప్రపంచకప్‌కు ముందు ఆస్ట్రేలియా జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జట్టు స్టార్ పేస్ బౌలర్, కీలక ఆటగాడు ప్యాట్ కమిన్స్ గాయం కారణంగా మెగా టోర్నీకి పూర్తిగా దూరమయ్యాడు. ఈ మేరకు ప్రావిజనల్ జట్టులో రెండు మార్పులు చేసి, 15 మందితో కూడిన తుది జట్టును క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ప్రకటించింది.

గతేడాది జూలైలో వెన్ను గాయానికి గురైన కమిన్స్, ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేదు. దీంతో అతడిని టోర్నీ నుంచి తప్పించాలని సీఏ నిర్ణయించింది. కమిన్స్ స్థానంలో మరో పేసర్ బెన్ డ్వార్షుయిస్‌ను జట్టులోకి తీసుకున్నారు. అదే సమయంలో టాప్ ఆర్డర్ బ్యాటర్ మ్యాథ్యూ షార్ట్‌ను కూడా తుది జట్టు నుంచి తొలగించారు.

అయితే, గాయాల కారణంగా యాషెస్ సిరీస్‌కు దూరమైన మరో ప్రధాన పేసర్ జోష్ హాజిల్‌వుడ్ పూర్తి ఫిట్‌నెస్ సాధించి జట్టులోకి తిరిగి రావడం ఆసీస్‌కు ఊరటనిచ్చే అంశం. పాకిస్థాన్ పర్యటనకు దూరమైన టిమ్ డేవిడ్ కూడా తుది జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఈ జట్టుకు మిచెల్ మార్ష్ సారథ్యం వహించనున్నాడు.

హేజిల్‌వుడ్, నాథన్ ఎల్లిస్, జేవియర్ బార్ట్‌లెట్‌లతో పేస్ విభాగం బలంగానే ఉంది. శ్రీలంక, భారత్‌లో జరగనున్న ఈ టోర్నీలో స్పిన్‌కు ప్రాధాన్యం ఇస్తూ ఆడమ్ జంపా, మాథ్యూ కునెమన్‌లను జట్టులో చేర్చారు. ఆస్ట్రేలియా గ్రూప్-బీలో ఉండగా, ఫిబ్రవరి 11న కొలంబోలో ఐర్లాండ్‌తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది.

# సెమీస్ బెర్త్ కోసం దాయాదుల మహా సమరం..

పాక్‌కు గెలిస్తే సరిపోదు!

అండర్-19 ప్రపంచకప్ సెమీస్ బెర్త్ కోసం భారత్-పాకిస్థాన్ కీలక పోరు

నేడు బులవాయో వేదికగా దాయాదుల మధ్య హైవోల్టేజ్ మ్యాచ్

పాక్‌పై గెలిస్తే గ్రూప్ టాపర్‌గా సెమీస్‌కు దూసుకెళ్లనున్న భారత్

అర్హత సాధించాలంటే పాకిస్థాన్ భారీ తేడాతో విజయం సాధించడం తప్పనిసరి

ఇప్పటికే సెమీస్‌కు చేరిన ఆస్ట్రేలియా, అఫ్గనిస్థాన్, ఇంగ్లండ్





**బులవాయో:** అండర్-19 ప్రపంచకప్ 2026 టోర్నీలో అసలైన సమరానికి రంగం సిద్ధమైంది. ఆఖరి సెమీ ఫైనల్ బెర్త్ కోసం చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ జట్లు తలపడనున్నాయి. బులవాయో వేదికగా ఆదివారం జరిగే ఈ సూపర్ సిక్స్ మ్యాచ్‌పై ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్థాన్, ఇంగ్లండ్ జట్లు నాకౌట్ దశకు చేరుకోగా, మిగిలిన ఒక్క స్థానం కోసం ఈ రెండు దాయాది దేశాలు పోటీ పడుతున్నాయి.

ప్రస్తుతం గ్రూప్-2 పాయింట్ల పట్టికలో ఆయుష్ మాత్రే నేతృత్వంలోని భారత జట్టు రెండో స్థానంలో ఉండగా, పాకిస్థాన్ మూడో స్థానంలో ఉంది. ఇంగ్లండ్ తన చివరి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై 65 పరుగుల తేడాతో గెలిచి, 8 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి సెమీస్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. దీంతో రేపు జరిగే భారత్-పాక్ మ్యాచ్ వర్చువల్ నాకౌట్‌గా మారింది.

### సెమీస్ సమీకరణాలు ఇలా...

భారత జట్టు ప్రస్తుతం పాకిస్థాన్ కంటే రెండు పాయింట్ల ఆధిక్యంలో ఉంది. దీనికి తోడు +3.337 నెట్ రన్‌రేట్ భారత్‌కు పెద్ద సానుకూలాంశం. పాకిస్థాన్‌పై విజయం సాధిస్తే, భారత జట్టు గ్రూప్-2 టాపర్‌గా నిలిచి సెమీ ఫైనల్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో తలపడుతుంది. ఒకవేళ ఈ మ్యాచ్‌లో ఓడిపోయినా, మెరుగైన రన్‌రేట్ కారణంగా భారత్‌కు సెమీస్ చేరే అవకాశాలు సజీవంగానే ఉంటాయి.

మరోవైపు పాకిస్థాన్ పరిస్థితి చాలా క్లిష్టంగా ఉంది. సెమీస్‌కు అర్హత సాధించాలంటే భారత్‌పై కేవలం గెలిస్తే సరిపోదు. భారీ తేడాతో విజయం సాధించడం తప్పనిసరి. మొదట బ్యాటింగ్ చేస్తే కనీసం 85 పరుగుల తేడాతో గెలవాలి. ఒకవేళ ఛేజింగ్ చేయాల్సి వస్తే, నిర్దేశిత లక్ష్యాన్ని 31.5 ఓవర్లలోపే (లక్ష్యం 250 అయితే 33.2 ఓవర్లలోపు) ఛేదించాల్సి ఉంటుంది. ఈ సమీకరణాలను అందుకుంటేనే పాక్‌కు సెమీస్ ఆశలు ఉంటాయి.

గ్రూప్ దశలో తమతో పాటు అర్హత సాధించిన మరో జట్టుపై గెలిచిన పాయింట్లను మాత్రమే సూపర్ సిక్స్ దశకు పరిగణనలోకి తీసుకున్నారు. ఈ నిబంధన కారణంగానే భారత్, ఇంగ్లండ్ కంటే పాకిస్థాన్ రెండు పాయింట్లు వెనుకబడి సూపర్ సిక్స్‌ను ప్రారంభించింది. ఇక, ఈ మ్యాచ్ ఫలితం ఇంగ్లండ్ సెమీస్ ప్రత్యర్థిని కూడా నిర్దేశిస్తుంది. భారత్ గెలిస్తే ఇంగ్లండ్.. ఆస్ట్రేలియాతో, పాక్ గెలిస్తే ఇంగ్లండ్.. ఆఫ్ఘనిస్థాన్‌తో సెమీస్‌లో ఆడుతుంది.

కాగా, గతేడాది ఆఖర్లో జరిగిన అండర్-19 ఆసియా కప్ టోర్నీ ఫైనల్లో భారత్, పాకిస్థాన్ పోటీపడ్డ విషయం తెలిసిందే. అయితే, ఈ మ్యాచ్‌లో భారత్‌ను ఓడించి పాక్ జట్టు ట్రోఫీని ఎగిరేసుకుపోయింది. రేపటి మ్యాచ్‌లో దాయాది దేశాన్ని మట్టికరిపించడం ద్వారా ఇప్పుడు భారత్‌కు ఆ ఘోర పరాభవానికి ప్రతీకారం తీర్చుకునే అవకాశం వచ్చింది.

## అమ్మానాన్నల విడాకులు పాఠం నేర్పాయి

**నటి శృతిహాసన్ భావోద్వేగం**



**టాకీస్:** కమల్ హాసన్ వారసురాలిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన శృతి హాసన్, ప్రస్తుతం స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అయితే, వెండితెరపై ఆమె గ్లామర్ వెనుక ఎంతో కష్టం.. భావోద్వేగమైన గతం ఉందని ఆమె తాజాగా ఒక ఇంటర్వ్యూలో బయటపెట్టారు. తన తల్లిదండ్రులు కమల్ హాసన్, సారిక విడిపోవడం తన జీవితాన్ని ఎలా మార్చేసిందో శృతి వివరించారు. తల్లిదండ్రుల విడాకుల తర్వాత తన జీవితం ఒక్కసారిగా తలకిందులైందని శృతి చెప్పారు. 'చెన్నైలో మెర్సిడెస్ బెంజ్ కార్లలో తిరిగిన నేను, అమ్మతో కలిసి ముంబై వచ్చాక లోకల్ ట్రైన్లలో ప్రయాణించాల్సి వచ్చింది. లగ్జరీ జీవితాన్ని, అలాగే కష్టాలను కూడా చూశాను' అని ఆమె తెలిపారు. అయితే, ఈ విడాకులు తనకు ఒక గొప్ప జీవిత పాఠాన్ని నేర్పాయని ఆమె అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఒక స్త్రీ ఆర్థికంగా, మానసికంగా స్వతంత్రంగా ఉండటం ఎంత ముఖ్యమో తనకు అప్పుడే అర్థమైందని చెప్పుకొచ్చింది.. 'ఇద్దరు వ్యక్తులు కలిసి సంతోషంగా ఉండలేనప్పుడు, బలవంతంగా ఒకే ఇంట్లో ఉండి నరకం అనుభవించడం కంటే.. విడిపోయి విడిగా సంతోషంగా ఉండటమే మంచిది. అందుకే వారు విడిపోయినందుకు నేను ఒక రకంగా సంతోషించాను' అని శృతి హాసన్ కుండబద్దలు కొట్టారు. మొదట్లో 'ఐరన్ లెగ్' అని విమర్శలు ఎదుర్కొన్నా, తన కష్టంతో నేడు దేశంలోనే అత్యధిక పారితోషికం తీసుకునే నటీమణుల్లో ఒకరిగా నిలవడం విశేషం. ప్రజంట్ ఈ మాటలు వైరల్ అవుతున్నాయి.

## మరోమారు జంటగా శివాజీ, లయ

**నేరుగా ఓటీటీలోకి 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'**



**టాకీస్:** టాలీవుడ్ సీనియర్ నటీనటులు శివాజీ, లయ చాలా కాలం తర్వాత జంటగా నటించిన క్రైమ్ కామెడీ చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం థియేటర్లకు రాకుండా నేరుగా డిజిటల్ వేదికగా విడుదలవుతోంది. అయితే ఈ సినిమా హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఈటీవీ విన్ దక్కించుకోగా.. తాజాగా స్ట్రీమింగ్ వివరాలను వెల్లడించింది. ఈ సినిమాను ఫిబ్రవరి 12 నుంచి స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు ప్రకటించింది.ఒకప్పుడు వెండితెరపై సూపర్ హిట్ జోడీగా పేరు తెచ్చుకున్న శివాజీ, లయ కాంబినేషన్ అనగానే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.




## పల్లెటూరి అమ్మాయిగా ఫరియా అబ్దుల్లా

**భగవంతుడు మూవీలో డిఫరెంట్ రోల్**

టాకీస్: 'జాతిరత్నాలు'తో ఒక్కసారిగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఫరియా అబ్దుల్లా పేరు చెబితే ఇప్పటికీ చాలామందికి చిట్టి పాత్రే గుర్తొస్తుంది. ఆ సినిమాతో వచ్చిన క్రేజ్ తర్వాత ఆమె కెరీర్ గ్రాఫ్ ఊహించినంత వేగంగా ముందుకెళ్లకపోయినా, ఫరియా మాత్రం తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తూనే ఉంది. మధ్యలో కొన్ని సినిమాలు చేసినా అవి పెద్దగా వర్కౌట్ కాలేదు. అయితే వెండితెరపై బ్రేక్ లేకపోయినా, సోషల్ మీడియాలో మాత్రం ఆమె యాక్టివిటీ ఎప్పుడూ తగ్గలేదు. గ్లామరస్ ఫోటోలు, వీడియోలతో ఫ్యాన్స్‌కు దగ్గరగానే ఉంటూ తన పాపులారిటీని కంటిన్యూ చేస్తోంది. ఇప్పటికే తిరువీర్ హీరోగా నటిస్తున్న 'భగవంతుడు' సినిమా టీజర్ విడుదల కావడంతో ఫరియా మళ్లీ చర్చలోకి వచ్చింది. ఈ టీజర్‌లో ఆమె లుక్, పాత్ర డిజైన్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. ఒకవైపు సంప్రదాయ పల్లెటూరి అమ్మాయిలా లంగా ఓణీలో కనిపిస్తూనే, మరోవైపు కథ డిమాండ్ మేరకు బోల్డ్ షేడ్స్ ఉన్న సీన్స్‌లోనూ ఆమె కనిపించడం హైలైట్‌గా నిలిచింది. ముఖ్యంగా రొమాంటిక్ సీన్స్, లిప్‌లాక్ షాట్, చివర్లో రౌడీలకు ఎదురెళ్లే ధీటైన ఎక్స్‌ప్రెషన్స్ చూస్తే, ఫరియాను ఇప్పటివరకు చూసిన ఇమేజ్‌కు పూర్తిగా భిన్నంగా చూపించారని చెప్పొచ్చు.కంటెంట్ బలంగా ఉంటే గ్లామర్ రోల్స్ చేయడంలో తనకు ఎలాంటి అభ్యంతరం లేదని ఫరియా ఇప్పటికే పలుమార్లు చెప్పింది. అదే మాటకు తగ్గట్టుగానే రూరల్ డ్రామాలో ఆమె పాత్రను డిజైన్ చేసినట్లు టీజర్ ద్వారా అర్థమవుతోంది. గ్లామర్‌ను మాత్రమే కాకుండా, ఎమోషన్, ఆగ్రహం, అమాయకత్వం అన్నీ కలిపిన పాత్రగా ఇది కనిపిస్తోంది. ఈ సినిమాలో ఆమెకు నటన పరంగా కూడా మంచి స్కోప్ ఉన్నట్టు టీజర్ స్పష్టంగా చెబుతోంది. ఒకవైపు ప్లలెటూరి అమ్మాయి అమాయకత్వం, మరోవైపు ధైర్యంగా నిలబడే మహిళగా ఆమె చూపించబోయే షేడ్స్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి.జిజి విహారి

## నా రాజకీయ ప్రవేశం ప్రభావం పడుతుందనుకున్నా

**జన నాయగన్ విడుదలపై నటుడు విజయ్**



**టాకీస్:** విజయ్ హీరోగా నటించిన 'జన నాయగన్' చిత్రం వివాదాల్లో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే దర్శక నిర్మాతలు దీనిపై స్పందించగా.. తాజాగా విజయ్ ఈ విషయంపై మాట్లాడారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'జన నాయగన్'కు ఇలా జరగడం చాలా బాధగా ఉందన్నారు. నా నిర్మాతల గురించి నాకు బాధగా ఉంది. నేను రాజకీయాల్లోకి రావడం వల్లే నా సినిమాకు ఇలా చేస్తున్నారు. నా కారణంగా నిర్మాతలు ఇబ్బంది పడుతున్నారు. రాజకీయరంగంలోకి రాకముందే వీటన్నిటికీ సిద్ధమయ్యాను. నా సినిమాపై ఈ ప్రభావం పడుతుందని ముందే ఊహించాను' అని తెలిపారు. ఈ సినిమా నిర్మాత వెంకట్ కె.నారాయణ కూడా దీని విడుదల ఆలస్యం కావడంపై ఇటీవల బాధపడ్డారు. దశాబ్దాల పాటు అభిమానులను అలరించిన విజయ్‌కు సినిమాల నుంచి మంచి వీడ్కోలు దక్కాలని ఆయన ఆకాంక్షించినట్లు చెప్పారు. కానీ, పరిస్థితి తమ చేయి దాటిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. సెన్సార్ సమస్య వల్ల ఈనెల 9న విడుదల కావాల్సిన 'జన నాయగన్' వాయిదా పడింది. ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు అదే తేదీన మద్రాస్ హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సీబీఎఫ్‌సీ మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. సెన్సార్ సర్టిఫికెట్ జారీపై న్యాయస్థానం తాత్కాలిక స్టే విధించగా.. నిర్మాణసంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సినిమా విడుదల విషయంలో జోక్యానికి నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం మద్రాసు డివిజన్ బెంచ్‌నే ఆశ్రయించాలని నిర్మాతలకు సూచించింది. ఈనెల 21న సుదీర్ఘ వాదనల అనంతరం డివిజన్ బెంచ్ తీర్పును రిజర్వ్ చేసింది. సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. మరోసారి దీనిపై విచారణ జరపాలని ఆదేశించింది.

## శ్రీవారిని దర్శించుకున్న అనిల్ రావిపూడి

టాకీస్: టాలీవుడ్ సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయన దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా వచ్చిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం భారీ విజయం పట్ల కృతజ్ఞతగా స్వామివారికి మొక్కులు చెల్లించుకోవడానికి ఆయన తిరుమల వచ్చారు.

శ్రీవారి దర్శనం అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడిన అనిల్ రావిపూడి తన తదుపరి ప్రాజెక్ట్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన నెక్స్ట్ మూవీపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని, మరో 10 నుంచి 15 రోజుల్లో అధికారికంగా అప్‌డేట్ ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. ఫిల్మ్ నగర్ సమాచారం ప్రకారం, అనిల్ తన తదుపరి చిత్రాన్ని విక్టరీ వెంకటేష్‌తో చేసే అవకాశం ఉంది. ఇది ఒక భారీ మల్టీస్టారర్ అని, ఇందులో తమిళ స్టార్ కార్తీ లేదా మలయాళ నటుడు ఫహద్ ఫాజిల్ నటించే ఛాన్స్ ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటివరకు ఎక్కువగా ఎంట్టంల్గ÷న్మెంట్ చిత్రాలే అందించిన అనిల్, ఈసారి పూర్తిగా కొత్త జానర్‌లో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ వేగంగా జరుగుతోంది.



## 'విత్ లవ్' తెలుగు ట్రైలర్ విడుదల

టాకీస్: దర్శకుడి నుంచి హీరోగా మారడం ఇండస్ట్రీలో కొత్తేమీ కాకపోయినా, ఒక సెన్సేషనల్ డైరెక్టర్ హీరోగా ఎంట్రీ ఇస్తుంటే ఆ అంచనాలే వేరుగా ఉంటాయి. 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రంతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అభిషన్ జీవింత్, ఇప్పుడు 'విత్ లవ్' సినిమాతో కథానాయకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాడు. మదన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ క్యూట్ లవ్ స్టోరీలో అభిషన్ జీవింత్ హీరోగా నటిస్తుండగా, మలయాళీ ముద్దుగుమ్మ అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తోంది.

ఈ సినిమాను సూపర్ స్టార్ రజనీకాంత్ కుమార్తె సౌందర్య రజనీకాంత్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 06న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా తెలుగు ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. ఇదొక స్వచ్ఛమైన ప్రేమకథగా కనిపిస్తోంది. ట్రైలర్‌లో విజువల్స్ మరియు మ్యూజిక్ ఒక ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగిస్తున్నాయి. ముఖ్యంగా యూత్ కనెక్ట్ అయ్యే ఎమోషన్స్ సినిమాలో పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సీన్ రోల్డాన్ సంగీతం అందిస్తుండగా, శ్రేయాస్ కృష్ణ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. కావ్య అనిల్,




సచిన్ నాచిప్పన్, తేని మురుగన్, శరవణన్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.